# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

3.2.2026 మంగళవారం Tuesday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 205 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789




# కోకాపేట్‌లో అక్రమ నిర్మాణాల రాజ్యం

- 250 గజాల్లో ఐదు అంతస్తుల అక్రమ భవనం
- మౌనం పాటిస్తున్న సర్కిల్ అధికారులు

నార్సింగి సర్కిల్ పరిధిలోని కోకాపేట్ గ్రామంలో అక్రమ నిర్మాణాలు హద్దులు దాటుతున్నాయి. కేవలం 250 గజాల స్థలంలో అనుమతులకు విరుద్ధంగా సెల్లార్‌తో కూడిన ఐదు అంతస్తుల భారీ భవనం ఏటువంటి అడ్డంకులు లేకుండా నిర్మాణంలో కొనసాగుతుండటం స్థానికంగా తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఇంత భారీ అక్రమ నిర్మాణం జరుగుతున్నా సంబంధిత సర్కిల్ అధికారులు మౌనం పాటిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

5





## యూపీ సీఎం యోగి సంచలన నిర్ణయం

ఉద్యోగులు ఆస్తుల వివరాలు ఇవ్వాలని ఆదేశం

.. వివరాలు 4లో



## ఎవరిపైనా కక్షసాధింపు చర్యలు లేవు

ఫోన్ ట్యాపింగ్ దుశ్చర్యలు బయటపడాల్సిందే

దోషులు ఎవరో తేల్చాల్సి ఉంది

మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ

.. వివరాలు 3లో




# నేరాలు చేస్తాం.. ప్రశ్నించొద్దంటే ఎలా?

అడ్డంగా సంపాదించి.. అధికార దుర్వినియోగం చేసివేలకోట్లు కూడాబెడితే అడుగొద్దా?

అధికారంలో ఉండగా ఉద్యమకారులు గుర్తురాలేదా?

బీఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ సీఎం రేవంత్

రావినారాయణరెడ్డి లాంటి నేతలు అరుదని కితాబు

జస్టిస్ సుదర్శన్ రెడ్డికి రావి నారాయణరెడ్డి పురస్కారం అందజేత

**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** బీఆర్ఎస్, కేసీఆర్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కొందరు తమకు తామే తెలంగాణ జాతిపిత అనుకుంటున్నారన్నారు. ఉద్యమకారులను అవమానిస్తారా అని గగ్గోలుపెడుతున్నారని ఎద్దేవా చేశారు. వారి హయాంలో ఉద్యమకారులను అవమానించలేదా అని సీఎం ప్రశ్నించారు. అక్రమాలకు పాల్పడితే ఎవరైనా విచారణ ఎదుర్కోవాల్సిందే అన్నారు. తప్పు చేస్తే ఎంతటి వారైనా విచారణ ఎదుర్కోక తప్పదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మీ ఇంటి తలుపులు బద్దలు కొట్టలేదు.. మిమ్మల్ని ఎవరూ ఈడ్చుకెళ్లలేదు.. చేసిన తప్పులకు నోటీసులు ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

మిగతా 2 లో



## కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంలో ఎదురుదెబ్బ

సోషల్ మీడియా పోస్టులపై అప్పీల్ తిరస్కరణ

2

## నరవణె పుస్తకంలోని వ్యాఖ్యల ఉల్లేఖన

లోక్‌సభలో రాహుల్ ప్రసంగంపై గందరగోళం

అడ్డుకున్న మంత్రులు రాజ్‌నాథ్, అమిత్ షా



రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో సోమవారం గందరగోళం తలెత్తింది. విపక్ష నేత రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణె రాసిన పుస్తకంలోని ఒక వాక్యాన్ని ప్రస్తావించడంతో గందరగోళం చెలరేగింది. వెంటనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాహుల్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. నరవణె పుస్తకం ఇంకా పబ్లిష్ కాలేదని, ప్రచురితం కాని పుస్తకం నుంచి వ్యాఖ్యలను పార్లమెంటరీ ప్రొసీడింగ్స్‌లో ఎలా ప్రస్తావిస్తారని నిలదీశారు.

4

## బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్

బుల్లెట్ ట్రైన్ల కేటాయిపులపై మంత్రి అశ్వినీ వైష్ణవ్



బుల్లెట్ ట్రైన్‌కు హైదరాబాద్ మహా నగరం హబ్‌గా మారుతుందని రైల్వే, ఐ టీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన రైల్వే ప్రాజెక్టులతోపాటు నిధుల కేటాయింపులను వివరించారు. సోమవారం న్యూఢిల్లీలో మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.5,454 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు.

మిగతా 4 లో




## గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్

బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు

ఛార్జ్‌షీట్ విడుదల చేసిన బీజేపీ చీఫ్ రామచంద్రరావు

గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ పీపుల్స్ ప్లాజాలో 'బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు' అంటూ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు.

3



2

## తెలుగు రాష్ట్రాల్లో పులి సంచారం

కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ప్రచారం

తొర్రేడులో పులిజాడతో ప్రజల భయాందోళన

అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారుల హెచ్చరిక

## రేబిస్ వ్యాక్సిన్ వికటించి పాప మృతి

2




విచారణ చేపడతామన్న ఆర్ఎంవో



# కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంలో ఎదురుదెబ్బ

## సోషల్ మీడియా పోస్టులపై అప్పీల్ తిరస్కరణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగలింది. సామాజిక మాధ్యమాల పోస్టులపై రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా కేసులు పెట్టడం ఏ మాత్రం చెల్లదంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీల్‌ను అత్యున్నత ధర్మాసనం తిరస్కరించింది. సోషల్ మీడియా పోస్టులపై అక్రమ కేసులు పెట్టడం ఏమాత్రం చెల్లదని గత ఏడాది సెప్టెంబర్‌లో హైకోర్టు సంచలన తీర్పును ఇచ్చింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతో పాటు చట్టాల స్ఫూర్తితోనే పోలీసులు పని చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు అప్రజాస్వామిక పద్ధతులతో సోషల్ మీడియా యాక్టివిస్టులను అణచివేయాలని చూస్తున్న ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా మారింది. ఒక ట్వీట్ చేసినందుకు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినందుకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా పోస్టులు చేసినందుకు కేసులు పెడతామంటే చెల్లదని, కేసులు పెట్టే ప్రతి వ్యక్తి ఏ విధంగా తనకు వ్యక్తిగతంగా నష్టం జరిగిందో చెప్పాల్సిన అవసరం బాధ్యత ఉంటుందని అప్పుడే ఎఫ్ఐఆర్లు నమోదు చేయాలని కఠినమైన ఆదేశాలను మార్గదర్శకాలను జారీ చేసింది. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా చేసిన పోస్టుల వలన మనోభావాలు దెబ్బతిన్నాయి, సామాజిక సమతుల్యత దెబ్బతింటుంది అంటూ అసత్యపు పునాదుల పైన అక్రమ కేసులు ఇప్పటిదాకా పెట్టిన ప్రభుత్వానికి ఈ తీర్పు ఒక గట్టి ఎదురు దెబ్బ అని చెప్పవచ్చు. హైకోర్టు తన తీర్పులో ఇచ్చిన మార్గదర్శకాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు ఫిర్యాదుదారుడు స్వయంగా బాధితుడా కాదా అనేది నిర్ధారించుకోవాలి, మూడవ పక్షం చేసే ఫిర్యాదులు పరువు నష్టం కేసులలో చెల్లవు. ప్రాథమిక విచారణ లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదు. అంతేకాకుండా, కేవలం రాజకీయ విమర్శలు లేదా కఠినమైన వ్యాఖ్యలను నేరంగా పరిగణించకూడదు. హింసను ప్రేరేపిస్తేనే అలాంటి కేసులు నమోదు చేయాలి. పరువు నష్టం అనేది నాన్-కాగ్నిజబుల్ నేరం కాబట్టి, నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, ఫిర్యాదుదారుడు మెజిస్ట్రేట్‌ను సంప్రదించాలని హైకోర్టు సూచించింది. చివరగా, పోలీసులు అరెస్టు చేసేటప్పుడు ఆర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, రాజకీయ ప్రేరేపితమైన లేదా నిరాధారమైన ఫిర్యాదులను తిరస్కరించాలని ఆదేశించింది. బీఆర్ఎస్ పార్టీ ట్వీట్లను రీట్వీట్ చేసినందుకు గానూ సోషల్ మీడియా వారియర్ శశిధర్ గౌడ్, అలియాస్ నల్ల బాలుపై పోలీసులు అక్రమంగా నమోదు చేసిన మూడు కేసులను హైకోర్టు కొట్టివేసింది.

# రేబిస్ వ్యాక్సిన్ వికటించి పాప మృతి

## విచారణ చేపడతామన్న ఆర్ఎంవో



**కామారెడ్డి, ఫిబ్రవరి 2:** యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వికటించి చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన కామారెడ్డిలో చోటుచేసుకున్నది. చిన్నారి మృతి ఘటనపై విచారణ చేపడుతామని ఆర్ఎంవో సంతోష్ తెలిపారు. ఉదయం 11.30 గంటలకు దవాఖాన నుంచి బయటికి వెళ్లారని, ప్రైవేట్ దవాఖానకు సుమారు 2.30 గంటలకు వెళ్లారని ఈ మధ్యలో ఏమి జరిగిందో విచారణ చేసిన తర్వాత చెప్పగలమని ఆయన పేర్కొన్నారు. రెండు డోస్‌లు వేసినప్పుడు పాప బాగానే ఉన్నదని, మూడో డోస్ వేసినప్పుడు కూడా బాగానే ఉన్నదని తెలిపారు. విచారణ తరువాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మండలం కొటాల్‌పల్లికి చెందిన అర్చన-రమేశ్ దంపతులు కామారెడ్డిలోని అయ్యప్ప నగర్‌కాలనీలో నివాసముంటున్నారు. వీరికి బాబు, పాప ఉన్నారు. జనవరి 25న ఇంటి ఎదుట ఆడుకుంటుండగా రెండున్నరేండ్ల క్రితిక్ సారాను కుక్క కరిచింది. కుటుంబ సభ్యులు వెంటనే కామారెడ్డి ప్రభుత్వ దవాఖాన తరలించగా, ఇంజెక్షన్ ఇచ్చారు. ఆదివారం మూడో డోస్ ఇప్పించడానికి చిన్నారిని జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. డోస్ తీసుకోగానే చిన్నారి అపస్మారక స్థితికి చేరగా, వెంటనే ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే చిన్నారి మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే చిన్నారి మృతి చెందిందని కుటుంబ సభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆందోళనకు దిగారు. దవాఖానలోని ఫర్నిచర్, అద్దాలను ధ్వంసం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకొని బాధిత కుటుంబీకులకు నచ్చజెప్పినా వినిపించుకోకుండా సుమారు రెండున్నర గంటలపాటు ఆందోళన చేశారు.

# 9,10 తేదీల్లో ఉస్మానియాలో తెలుగు లిటరరీ కాంగ్రెస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** ఈనెల 9, 10 తేదీల్లో రూమ్ నెంబర్ 133, ఆర్ట్స్ కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం రెండు రోజులపాటు రెండవ తెలుగు లిటరరీ కాంగ్రెస్ జరగబోతోంది. యువరచయితల సాహిత్య సజన కేంద్రంగా జరగబోతున్న ఈ కాంగ్రెస్లో మొత్తం పది సెషన్లు ఉంటాయి. దాదాపు 55 మంది యువ కవులు, రచయితలు, నవలాకారులు, విమర్శకులు, సినిమా రచయితలు పాల్గొంటారని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం తెలిపారు. ఈ రెండు రోజులూ ఆర్ట్స్ కళాశాల ముందు బహిరంగ ఆవరణలో కవితా దునియా, కవిత జిందగీ పేర్లతో కవితా పఠనం, గాన/కళా ప్రదర్శనలు జరుగుతాయి. దీంట్లో దాదాపు 40 మంది యువ కవిగాయకులు, జానపద వత్తికళా ప్రదర్శకులు పాల్గొంటారు. ఈ రెండవ కాంగ్రెస్ కు డైరెక్టర్‌గా ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ చింతకింది కాశీం, కన్వీనర్‌గా తెలుగుశాఖ అధ్యక్షులు, ఆచార్య సాగి కమలాకర శర్మవ్యవహరిస్తారు.

# నేరాలు చేస్తాం.. ప్రశ్నించొద్దంటే ఎలా?

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రావినారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగిన రావి నారాయణ రెడ్డి జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి పురస్కారాన్ని ప్రదానం చేశారు. తెలంగాణ కోసం సర్వం కోల్పోయిన మహనీయుడు రావి నారాయణ రెడ్డి అని సీఎం గుర్తు చేశారు. ఈ మధ్య తెలంగాణ జాతిపిత అని కొందరు వాళ్లకు వాళ్లే రాసుకుంటున్నారని, ఉద్యమకారులమని వాళ్లే చెప్పుకుంటున్నారని విమర్శించారు. పోలీసులు చిన్న నోటీసులు ఇస్తే జాతిపితకు నోటీసులు ఇస్తారా అని అంటున్నారని, తెలంగాణ సమాజానికి అవమానం జరిగిందని ప్రచారం చేస్తున్నారని సీఎం ఎద్దేవా చేశారు. ఆనాడు జాతిపిత గాంధీజీ పదవులను త్యాగం చేశారని, దుర్మార్గుల తూటాలకు ప్రాణాలు వదిలారని గుర్తు చేశారు. ఇప్పుడు జాతిపిత అని చెప్పుకుంటున్న వాళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులను ఏకం చేసి ఉద్యమాన్ని నడిపించిన ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారుడు కాదా? అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఆనాడు తలుపులు బద్దలు కొట్టి కోదండరాంను అరెస్టు చేసినప్పుడు ఉద్యమకారులు గుర్తుకురాలేదా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలదీశారు. నోటీసులు ఇచ్చి విచారణకు పిలిస్తేనే ఏదో జరిగినట్లు రాద్ధాంతం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రావి నారాయణ రెడ్డి లాంటి వారు తెలంగాణ కోసం సర్వం కోల్పోయారని, పదవులు, వేలకోట్ల ఆస్తులు సంపాదించుకున్న వాళ్లు ఉద్యమకారులు ఎలా అవుతారని ప్రశ్నించారు. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించినప్పుడు అర్థం చేసుకుని.. హుందాగా తప్పుకుంటే కొంతైనా మీ గౌరవం నిలబడేదన్నారు.

ప్రజలే తప్పు చేశారని చెప్పడం.. ఇదెక్కడి ప్రజాస్వామ్యం, ఇదెక్కడి ఉద్యమకారుడి లక్షణం, ఇదెక్కడి జాతిపిత లక్షణం అని ప్రశ్నించారు. అక్రమ మార్గం ఎంచుకున్న వారికి ప్రజాస్వామ్యంలో విచారణ ఎదుర్కోవాల్సిందే అని అంబేద్కర్ చెప్పారని, శిబు సోరెన్ లాంటి వాళ్లు విచారణ ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. మధ్య యుగాల చక్రవర్తులు తమ బాధను రాజ్యం బాధగా ప్రచారం చేసేవారని, ఇది ప్రజాస్వామ్య యుగమని, మధ్య యుగాల చక్రవర్తులకు కాలం చెల్లిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో తప్పు చేసినవారు విచారణ ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారు.

## జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అవార్డు దక్కడం సముచితం: సీఎం

రావి నారాయణరెడ్డి జాతీయ పురస్కారం జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి గారికి దక్కడం సముచితమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. తొలి తరంలో బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణ రెడ్డి స్ఫూర్తినిస్తే, మలి తరంలో జైపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి లాంటి వాళ్లు తెలంగాణ సమాజానికి ఒక స్ఫూర్తి నింపారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. 2019 లో నిబద్ధత కలిగిన, ప్రశ్నించగలిగిన వారు రాజకీయాల్లో ఉండాలని జైపాల్ రెడ్డిని తాను కోరానని గుర్తు చేశారు. ఆ సమయంలో తరం మారింది.. ప్రత్యక్ష రాజకీయాలకు తను దూరం అని, యువతరం రాజకీయాల్లో ఉండాలని జైపాల్ రెడ్డి తనను ప్రోత్సహించారని తెలిపారు. సమాజంలో వస్తున్న మార్పును, ప్రజల ఆలోచనని గౌరవించిన గొప్ప నాయకులు జైపాల్ రెడ్డి, రావి నారాయణరెడ్డి అని సీఎం అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి నిబద్ధత ప్రధాని మోదీని భయపెడుతుందని, ఆయనను రాహుల్ గాంధీ ఉపరాష్ట్రపతిగా బరిలో దించారన్నారు. ప్రజలకు ప్రజాస్వామ్య స్ఫూర్తిని అందించాలనే ఏక పార్టీ, ఏక వ్యక్తి పాలనకు వ్యతిరేకంగా సుదర్శన్ రెడ్డి ఎన్నికల బరిలో దిగారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తికి రావి నారాయణరెడ్డి పురస్కారం అందించడం సముచితమని ముఖ్యమంత్రి తెలిపారు.

## రావి నారాయణ రెడ్డికి గౌరవం కల్పిస్తాం

అరాచక శక్తులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు రావి నారాయణరెడ్డి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా పేద ప్రజల కోసం తన 500 ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. రాచరిక పాలనకు వ్యతిరేకంగా పోరాడి వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆయన పోరాడారన్నారు. బండెనక బండి కట్టి, పదహారు బండ్లు కట్టి అని తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన బండి యాదగిరి లాంటి నిరక్షరాస్యులను ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. దేశంలో మొట్ట మొదటి ప్రధాని నెహ్రూ కంటే ఎక్కువ మెజారిటీతో పార్లమెంట్ సభ్యుడిగా




ఎన్నికయ్యారన్నారు. ప్రజా తీర్పును ప్రతిబింబించేలా ఆనాడు మొట్టమొదటి పార్లమెంట్ భవనాన్ని రావి నారాయణరెడ్డితో నెహ్రూ ప్రారంభింపజేశారని సీఎం తెలిపారు. అరవై ఏళ్ల వయసులో ప్రజలకు స్ఫూర్తినిస్తూ పార్టీ, రాజకీయ పదవుల నుంచి తప్పుకున్న గొప్ప నేత రావి నారాయణరెడ్డి అన్నారు. ఈ కాలంలో ప్రజలు ఓడించినా కొందరు పదవులు వదులుకోవడానికి సిద్ధంగా ఉండటం లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల తరువాత రావి నారాయణ రెడ్డికి సముచిత గౌరవం ఇచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. సచివాలయంలోఅందరితో సమావేశమై తెలంగాణలో సముచిత గౌరవం కల్పించే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

## రాజ్యాంగంపై దాడిని తిప్పి కొట్టాలి:

రాజ్యాంగాన్ని రద్దు చేయడమే బీజేపీ రహస్య ఎజెండా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. మోదీ ప్రభుత్వం దేశంలో ఏక పార్టీ, ఏక వ్యక్తి వ్యవస్థను తీసుకువచ్చే కుట్ర చేస్తోందన్నారు. అబ్ కీ బార్ చార్ సౌ పార్ అనే నినాదం ఫలించకపోవడంతో రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కాలరాయాలని బీజేపీ SIRను తీసుకువచ్చిందన్నారు. ఓటు హక్కును కాలరాయాలన్న కుట్రపై కమ్యూనిస్టులు గ్రామాల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. రాజ్యాంగంపై దాడి జరుగుతోందని.. దీనిపై మనమంతా ప్రజల్లో చైతన్యం కలిగించాలని పిలుపునిచ్చారు. నాణానికి ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు కమ్యూనిస్టులు నిలిచి రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# పట్టణాల్లో కాంగ్రెస్‌నే గెలపించండి

## బిఆర్ఎస్‌ను ఓడిస్తేనే అభివృద్ధి సాధ్యం

## బిజెపికి 8మంది ఎంపిలున్నా రాష్ట్రానికి శూన్యం


## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపు



**జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 2:** రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టణ ప్రాంత ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. పట్టణ ప్రజలకు న్యాయం జరగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి, కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మున్సిపల్ శాఖ బాధ్యతలను నిర్వహిస్తూ, పట్టణాల్లో మౌలిక సదు-పాయాల కల్పనకు , సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వివరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తామని, మున్సిపాలిటీలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ పార్లమెంట్ సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను సాధించడంలో వారు పూర్తిగా విఫలమయ్యారని శ్రీధర్ బాబు విమర్శించారు. ఇంతమంది ఎంపీలు ఉండి కూడా నిధులు రాకపోవడం బాధాకరమని, ఇది రాష్ట్ర ప్రజలకు జరిగిన అవమానమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని, పూర్తిగా నిరాశజనకంగా ఉందని ఆయన విమర్శించారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర విభజన జరిగి ఇన్నేళ్లవుతున్నా, విభజన చట్టంలోని 42 కీలక అంశాలు నేటికీ పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉండటం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ సమావేశాల్లోనైనా ఆ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించామని, కానీ కేంద్రం మళ్ళీ మొండిచేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేంద్రం వెంటనే స్పందించి విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రతిష్టాత్మక సంస్థల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న తీరును శ్రీధర్ బాబు ఎండగట్టారు. తెలంగాణకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఐఐఎం వంటి ఉన్నత విద్యాసంస్థ వస్తుందని రాష్ట్రం ఎంతో ఆశగా ఎదురుచూసిందని, కానీ బ్జడెట్‌లో దాని ఊసే లేకపోవడం దారుణమన్నారు. అలాగే హైదరాబాద్ నగరవాసుల చిరకాల స్వప్నమైన మెట్రో ఫేజ్-2 విస్తరణకు నిధులు కేటాయిస్తారని ఆశించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. విద్యా రంగంలో కేంద్రీయ , నవోదయ విద్యాలయాల కేటాయింపులో కూడా రాష్ట్రానికి మొండిచేయి ఎదురైందని విమర్శించారు. ఐటి , పారిశ్రామిక రంగంలో కీలకమైన సెమీ కండక్టర్ చిప్స్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలను తెలంగాణకు కేటాయించడంలో కేంద్రం పక్షపాత ధోరణి ప్రదర్శిస్తోందని, గతంలోనూ ఇదే జరిగిందని ఆయన గుర్తు చేశారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న లైఫ్ సైన్సెస్ , ఫార్మా పాలసీలను కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకోవడం మన పాలనకు నిదర్శనమని చెప్పారు. అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, కేంద్రం కూడా తన బాధ్యతను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలకు నిధులు విడుదల చేయాలని కోరారు.

# తెలుగు రాష్ట్రాల్లో పులి సంచారం కలకలం

- కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ప్రచారం
- తొర్రేడులో పులిజాడతో ప్రజల భయాందోళన
- అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారుల హెచ్చరిక
- పులిని పట్టుకునేందుకు బోను, సిసి కెమెరాల ఏర్పాటు



**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 2:** రాజమహేంద్రవరం మండలంలోని తొర్రేడులో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. పెద్దపులి దాడిలో మృతి చెందిన రెండు ఆవులు, దూడ కళేబరాలను వారు గుర్తించారు. పెద్దపులిని పట్టుకునేందుకు తొర్రేడు తోటల్లో పులి బోను, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ, సీతానగరం మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు డీఈవో సోమవారం సెలవు ప్రకటించారు. పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలోని ప్రజల్ని, పర్యాటకుల్ని అధికారులు అప్రమత్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి రెండు పెద్ద పులులు జనారణ్యంలోకి వచ్చినట్టు అటవీ అధికారులు భావిస్తున్నారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పులుల సంచారం కలకలం రేపుతున్నాయి. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పులుల సంచారం ఎక్కువైపోయింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుంచి తెలుగు రాష్ట్రాల్లోకి వచ్చిన పులులు అలజడి సృష్టిస్తున్నాయి. మొన్నటి వరకు ఏలూరు జిల్లా ఏజెన్సీని వణికించిన పెద్దపులి ఇప్పుడు తూర్పు గోదావరిలోకి ప్రవేశించింది. నిన్న రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడులో పశువులపై దాడి చేసి చంపేసింది. పులి దాడిపై స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు మీడియా సమావేశం నిర్వహిస్తుండగా.. వారి వెనకాలే పులి కనిపించింది. పులి సంచారం నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు రాజమండ్రి రూరల్, కోరుకుంట్ల, సీతానగరం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. పిల్లల్ని బయటకు వెళ్లనీయకుండా జాగ్రత్త తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించింది. ఇక నెల్లూరు జిల్లా దత్తలూరు మండలం నందిపాడులోనూ పెద్దపులి కలకలం సృష్టిస్తోంది. రేమానుకుంట వద్ద స్థానికులకు పెద్దపులి కనిపించింది. దీంతో ఉదయగిరి పరిసర ప్రాంతాలవారు భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పెద్దపులి సంచారం.. జనాలతో పాటు ఫారెస్ట్ అధికారుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. 15 రోజులుగా ఫారెస్ట్ అధికారులు పెద్దపులిని పట్టుకోవటానికి ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ లాభం లేకుండా పోయింది. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి ఆ పెద్దపులి వచ్చినట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఈ పెద్దపులి యాదాద్రి భువనగిరితో పాటు సిద్ధిపేట జిల్లా సరిహద్దులోనూ సంచరిస్తోంది. ఇక హైదరాబాద్ శివారు ప్రాంతంలోనూ ఓ పెద్దపులి తిరుగుతున్నట్లు సమాచారం.

# గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్

**బూటకపు హామీ లు - మోసపూరిత వాగ్దానాలు**

**ఛార్జ్‌షీట్ విడుదల చేసిన బీజేపీ చీఫ్ రామచంద్రరావు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విమర్శించారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పై రాంచందర్‌రావు నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ పీపుల్స్ ప్లాజాలో 'బూటకపు హామీలు – మోసపూరిత వాగ్దానాలు' అంటూ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ బూటకపు హామీలు, మోసపూరిత వాగ్దానాలు, సేవ్ తెలంగాణ, ఓట్ బీజేపీ థీమ్‌తో ఈ ఛార్జ్ షీట్‌ను విడుదల చేశామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేని పరిస్థితుల్లో రేవంత్ ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని.. కానీ నేటికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వేల కోట్ల రూపాయిల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యం పూర్తిగా కుంటుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ సంపూర్తిగా అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని.. తద్వారా లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు. షో పుటప్ తప్ప.. రాష్ట్రంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు లేదంటూ రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఓట్ల కలెక్షన్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు అంటూ ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీలకు చేసిందేమిటో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. 7 మున్సిపల్ కార్పొరేషన్లలో టాక్సీల పేరు మీద భారీ కుంభకోణం జరుగుతోందని విమర్శించారు. దీనిలో రూ. 250 కోట్లకుపైగా కుంభకోణం జరిగిందని వివరించారు. మున్సిపాలిటీలకు వచ్చే నిధుల్లో ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నవేనని గుర్తు చేశారు. రాష్ట్రంలో రహదారులన్నీ అధ్వానంగా మారాయని.. నిత్యం రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది మరణిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్రైమ్ విపరీతంగా పెరిగిపోయిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందన్నారు. డ్రగ్స్‌కు కేంద్రంగా తెలంగాణ మారిపోయిందంటూ మండిపడ్డారు. హిందూ దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. చివరకు దేవాలయాల భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. కమిషన్, కాంట్రాక్ట్, కరప్షన్ ప్రభుత్వమని అభివర్ణించారు. ఇది 40 పర్సెంట్ కమిషన్ ప్రభుత్వమని వ్యంగ్యంగా అన్నారు. తమ ఫోన్లు ట్యాపింగ్ చేసి.. తమపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ చేయవలసిన అవసరం ఎందుకొచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. తొలుత బీజేపీ నేతల ఫోన్లనే ట్యాపింగ్ చేశారని గుర్తు చేశారు. సేవ్ తెలంగాణ.. ఓట్ బీజేపీ నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచించాలని, గతంలో రెండు పార్టీలకు అవకాశం ఇచ్చారని.. ఒకసారి బీజేపీకి కూడా అవకాశం ఇవ్వండంటూ టీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు.

# సిట్ చీఫ్ సజ్జన్నార్ వ్యాఖ్యలు సరికాదు

**చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ అని ఎలా ప్రకటిస్తారు**

**ఇది పోలీస్ మాన్యువల్‌కు వ్యతిరేకం అని తెలియదా**

**కేసీఆర్ విచారణ తరవాత ఘటనపై హరీష్ రావు అభ్యంతరం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ విచారణ ముగిసిందని నగర పోలీస్ కమిషనర్, సిట్ ఇన్‌ఛార్జ్ సజ్జనార్ చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు సీరియస్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం విచారణలోనే ఉన్నప్పుడే ఇల్లీగల్ అని ఎలా తేల్చేశారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ఇల్లీగల్ అవునా కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం నిర్ణయాంచాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణ కింద పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణ కొనసాగుతున్న దశలోనే దీనిని అక్రమంగా పేర్కొనడం చట్ట విరుద్ధమని హరీశ్‌రావు తెలిపారు. కానీ ఈ తరహా వ్యాఖ్యలు సిట్ చీఫ్ సజ్జనార్ చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో న్యాయస్థానం తుది తీర్పు ఇచ్చే వరకు ఏ ఆరోపణను కూడా నేరంగా పరిగణించకూడదన్నది స్థిరమైన న్యాయసూత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో భాగమైన డాక్టరిన్ ఆఫ్ ప్రిజంప్షన్ ఆఫ్ ఇన్నోసెన్స్ చెబుతుందని తెలిపారు. దర్యాప్తు చేయడమే పోలీసుల బాధ్యత తప్ప.. తీర్పు చెప్పే అధికారం వారికి లేదని వ్యాఖ్యానించారు.. ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా? కాదా అన్నది భారత టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ అలాగే పీయూసీఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందో లేదో న్యాయస్థానమే నిర్ణయించాల్సి ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కేసీఆర్ సిట్ విచారణ పూర్తయ్యిందని చేసిన అధికారిక ప్రకటనలోనే అక్రమమం అని తేల్చడం సరికాదని అన్నారు. సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు దర్యాప్తు ఫలితంపై ముందస్తు అభిప్రాయంతో ఉన్నట్లు కనిపిస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు. ఇది ఆలిండియా సర్వీసెస్ (కండక్ట్) రూల్స్ 1968కు విరుద్ధమని అన్నారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకుడికి సంబంధించి రాజకీయంగా సున్నితమైన అంశంలో ఇలాంటి వ్యాఖ్యలు రావడం ద్వారా దర్యాప్తులో నిష్పక్షపాతత్వంపై అనుమానాలను కలిగిస్తున్నాయని తెలిపారు. విచారణకు ముందే తప్పు జరిగిందనే భావన కలిగించేలా చేసిన ప్రకటనలు ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. పోలీస్ కమ్యూనికేషన్లను రాజకీయ కథనాలను బలపరిచేందుకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా, వృత్తిపరంగా చట్ట పరిధిలోకి లోబడే పనిచేయాలని హరీశ్‌రావు సూచించారు. పోలీసుల ప్రకటనల ద్వారా కాకుండా తీర్పులను కోర్టులు ఇవ్వాలని అన్నారు. రాజ్యాంగ పరిమితులను దర్యాప్తు సంస్థలు విస్మరిస్తే ప్రజాస్వామ్యం నిలవదని హెచ్చరించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్‌ను సిట్ చీఫ్ ఎందుకు గుర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో హరీష్‌రావు ఒక పోస్టు పెట్టారు. పోలీసులకు దర్యాప్తు బాధ్యత మాత్రమే అప్పగించబడిందని, విచారణ దశలో ఏదైనా చర్యను చట్టవిరుద్ధమని ప్రకటించడానికి పోలీసులు న్యాయమూర్తులో లేదా న్యాయనిర్ణేతలో కాదని పేర్కొన్నారు.

# రాహుల్‌ను అడ్డుకోవడం సరికాదు

**చెప్పాల్సిన విషయం చెప్పకుండా పోయింది**

**లోక్‌సభలో ప్రభుత్వ తీరును తప్పుపట్టిన శశిథరూర్**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** రాహుల్ గాంధీ లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై అధికార పక్షం అతిగా స్పందించిందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణెళి రాసిన పుస్తకం లోని విషయాలతో వచ్చిన ఒక ఆర్టికల్‌ను రాహుల్ తన ప్రసంగంలో ప్రస్తావిస్తుండగా అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం తలెత్తి సభ వాయిదా పడింది. అనంతరం మీడియా సమావేశంలో రాహుల్‌కు బాసటగా శశిథరూర్ స్పందించారు. తన ఆందోళనను బయటపెట్టే అవకాశం ఆయనకు ఎప్పుడూ రాలేదు' అని శశిథరూర్ పేర్కొన్నారు. ఆ కథనం బలగాలను కానీ సైనికులను కానీ తప్పుపట్టలేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న, తీసుకోకుండా పోయిన కొన్ని అంశాలను మాత్రమే రాహుల్ గాంధీ ప్రస్తావించాలనుకున్నారని, దానికి ప్రభుత్వం అంత అతిగా స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. రాహుల్ లేవనెత్తాలనుకున్న అంశం గురించి ప్రజలకు తెలిసిందేనని, ఆయన ఓ మ్యాగజైన్‌లో ప్రచురితమైన కథనంగా ఆధారంగానే మాట్లాడారని వివరించారు. ఆ పుస్తకం ప్రచురితం కాలేదని ప్రభుత్వం అభ్యంతరం చెప్పడానికి బదులుగా ఆయనకు మాట్లాడే అవకాశం ఇచ్చి ఉండాల్సి ఉందని శశిథరూర్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అతిగా స్పందించాల్సిన అవసరం లేదు. అది సభ వాయిదాకు దారితీసింది. చర్చ కొనసాగించి ఉంటే పార్లమెంటులో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రతిబింబించి ఉండేది. నిజాలు తప్పయితే నిజాలను సవరించాలి. కానీ నిజాలను ప్రసారం కాకుండా అడ్డుకోకూడదు' అని శశిథరూర్ వ్యాఖ్యానించారు. పండిట్ జవహర్‌లా నెహ్రూ హయాంలో పార్లమెంటులో జరిగిన కీలక చర్చను ఈ సందర్భంగా శశిథరూర్ ప్రస్తావించారు. 1962లో చైనా-భారత్ యుద్ధం జరుగుతుండగా పార్లమెంటు సమావేశమైందని, ఒకవైపు యుద్ధం జరుగుతుండగా చర్చలను పొడిగించి మరీ నిర్వహించారని చెప్పారు. 'అప్పుడు ఎలాంటి విప్‌లు లేవు. ప్రభుత్వ ఎంపీలు సైతం ప్రభుత్వాన్ని, ప్రధానమంత్రి నెహ్రూను సైతం విమర్శించగలిగే వారు' అని తెలిపారు. 1965, 1971 యుద్ధాల సమయంలోనూ పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి ఆ వివరాలను ఎంపీలతో పంచుకోవడం, దేశ ప్రజలను పరిగణనలోకి తీసుకోవడం జరిగిందని ఆయన వివరించారు.



# ఎవరిపైనా కక్షసాధింపు చర్యలు లేవు

**ఫోన్ ట్యాపింగ్ దుశ్చర్యలు బయటపడాల్సిందే**

**దోషులు ఎవరో తేల్చాల్సి ఉంది**

**మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ**

**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** ఫోన్ ట్యాపింగ్ కేసుపై తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చట్టం తన పని తాను చేస్తుందని స్పష్టం చేశారు. భార్యాభర్తల సంభాషణలు వినే దుశ్చర్యకు పాల్పడితే విచారణ జరపాలా వద్దా అని ప్రశ్నించారు. తప్పుచేసి మాపైనే అభియోగాలు మోపుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎవరి మీదా కక్ష సాధింపు ఆలోచన లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్రానికి చెడ్డపేరు తెచ్చిందన్నారు. సాధారణంగా ఉగ్రవాదులు, ఆటంకవాదుల ఫోన్లను ట్యాప్ చేస్తారని.. కానీ ఇక్కడ నాయకులు, జడ్జిలు, వ్యాపారవేత్తల ఫోన్లనే ట్యాప్ చేశారని చెప్పారు. ఆధారాలు లభించిన నేపథ్యంలో విచారణ జరుగుతోందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేశారు? ఎందుకు చేశారో.? తేల్చాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. బీజేపీ నేతలు బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అర్వింద్ ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేయాలని డిమాండ్ చేశారని ప్రస్తావించారు. వారి కుటుంబ సభ్యులు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని బీజేపీ నేతలు చెబుతున్నారన్నారు. ఈ నీచానికి ఎవరు ఒడిగట్టారో విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. దుశ్చర్యకు పాల్పడ్డవారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

# కులం కాదు.. గుణం చూసి ఓటేయండి

**మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం**


**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**



**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** మున్సిపల్ ఎన్నికల్లో కులం కాదని.. గుణం చూసి ఓటేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. పైసలు కాదని.. పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. మంచి అభ్యర్థులు ఏ పార్టీ నుంచి పోటీ చేసినా ఓటు వేయాలని కోరారు. తెలంగాణ జాగృతి తరఫున మంచి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం మీడియాతో కవిత మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ టార్గెట్‌గా విమర్శలు చేశారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎవరు నిలబడ్డ కారు గుర్తుపై ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారని ప్రస్తావించారు. చెడ్డ వాళ్లకి ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారా అని ప్రశ్నించారు. కేటీఆర్ మాటలు నియంతృత్వం, రాచరికపు పోకడలకు నిదర్శనమని విమర్శించారు. రేవంత్‌రెడ్డితో హరీశ్‌రావు కుమ్మక్కు అయి.. నాటకాలాడుతు న్నారని కవిత విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఫెయిర్‌గా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై కేసీఆర్‌ని సిట్ విచారణకు పిలిచిందని ప్రస్తావించారు. ఈ కేసులో సిట్ విచారణకు పిలిస్తే ఎవరైనా పోక తప్పదని కవిత స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో తెలంగాణకు మోదీ సర్కార్ అన్యాయం చేసిందని కవిత విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. గంజాయి ముఠా దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీ ఫీజు సొంతంగా కట్టుకున్నారా..? ప్రభుత్వ సొమ్ముతో కట్టారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఈ విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి ఎన్ని ఏంఓయూలు చేసుకున్నారని నిలదీశారు. ఫేక్ కంపెనీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకుందని ఆక్షేపించారు. కాంగ్రెస్ ఫేక్ ఎంఓయూలపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. ఫేక్ ఏంఓయూలపై జాగృతి పోరాటం చేస్తుందని కవిత పేర్కొన్నారు.

# మేం గేట్లు తెరిస్తే బీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరు

**మంత్రి అడ్లూరి సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** మేం గేట్లు ఓపెన్ చేస్తే బీఆర్ఎస్ పార్టీలో ఎవరూ మిగలరని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రేవంత్ రెడ్డిని కాదని కేసీఆర్ దగ్గరికి వెళ్లే నేతలు ఎవరూ ఉండరని మంత్రి స్పష్టం చేశారు. బిఆర్ఎస్‌లో చేరేందుకు ఎవరు కూడా సిద్దంగా లేరన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో చేరికలు ఉంటాయని కేసీఆర్ అనడం హాస్యాస్పదమన్నారు. బీఆర్ఎస్.. పదేళ్లలో కాంగ్రెస్ నేతలపై పెట్టిన అక్రమ కేసులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఈ సందర్భంగా లక్ష్మణ్ డిమాండ్ చేశారు. తాము రెండేళ్లలో బీఆర్ఎస్ నేతలపై ఎలాంటి అక్రమ కేసులు పెట్టలేదన్నారు. అక్రమంగా దోచుకున్న డబ్బులతో బీఆర్ఎస్ నేతలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారని విమర్శించారు. తప్పు చేయకపోతే విచారణకు సహకరించాలి తప్ప.. భయపడటం ఎందుకని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఎన్నో దుర్మార్గాలు జరిగాయన్నారు. అవన్నీ బయటపడాల్సి ఉందన్నారు.




సంపాదకీయం

# మసిపూసి మారేడుకాయ!

మసిపూసి మారేడుకాయ చేయడమంటే ఇదే. దేశంలో ప్రజల ఆకలిబాధలను, పరిస్థితులను,రోదనలను పట్టించుకోకుండా బడ్జెట్ యధావిధిగా ప్రవేశ పెట్టారు. గత 9 ఏళ్లుగా నిర్మలా సీతారామన్ బడ్జెట్ వల్ల దేశంలో మార్పులు ఏమైనా వచ్చాయా అని చర్చిస్తే..వచ్చాయనే చెప్పాలి. దేశంలో ఆర్థిక మందగమనం సాగుతోంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గింధి. నిత్యాసవర వస్తువులతో పాటు అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయి. ముఖ్యంగా ఔషధాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కోవిడ్ తరవాత ధరలను పరిశీలిస్తే 200 నుంచి 500 శాతం వరకు ఔషధాల ధరలు పెరిగాయి. సామాన్యునులు వైద్యం చేయించుకునే మాటెలా ఉన్నా..మందులు కొనుక్కుని వేసుకునే దిక్కులేకుండా పోయింది. మరి బడ్జెట్ ప్రగతిశీలమైతే ఇవన్నీ ప్రభావం చూపాలి. చూపడం లేదంటే బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగిందేమీ లేదని గుర్తించాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మార్పురావడం లేదు. ప్రజల చేతుల్లో డబ్బులు ఆడడం లేదు. సంపాదించింది తిండికి కూడా సరిపోవడం లేదు. ఇలా నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరోసారి సామాన్యులను నిజంగానే వంచించింది. ఒకదాని తరువాత ఒకటిగా చోటుచేసుకుంటున్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ ఆర్థిక సర్వే చేసిన హెచ్చరికలను సైతం బేఖాతరు చేసింది. కొద్దిమంది కోటీశ్వరుల ప్రయోజనాలను రక్షించేదిగా మాత్రమే బడ్జెట్ ఉంది. వరుసగా తొమ్మిదవసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలోఘనంగా చెప్పిన 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' నిర్దాక్షిణ్యంగా సగటుజీవి పైనుండి దూసుకెళ్ళింది. ఫలితం 53,47,315 కోట్ల రూపాయల బడ్జెట్ సామాన్యులను ప్రమాదంలోకి నెట్టింది. కార్పొరేట్లకు, కోటీశ్వరులకు రాయితీలు, వరాల వర్షం కురిపించినప్పుడు గుర్తుకురాని ఆర్థిక క్రమశిక్షణ కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు, మధ్య తరగతి ప్రజానీకానికి మాత్రం గుర్తు చేశారు. దేశంలోని కోటానుకోట్ల జనానికి మేలు చేసేదిలా బడ్జెట్ లేదన్నది ముమ్మాటికీ నిజం. ప్రతిపక్ష సభ్యులు మొదలు, ఆర్థిక సంస్కరణ అభిలాషులు సైతం దీనిని అంగీకరిం చారు. ఫలితంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం ఇలా ఒకటేమిటి?అన్ని రంగాల సాధారణ ప్రజానీకానికి సంబంధించిన పథకాల కేటాయింపుల్లో కోతలు పడ్డాయి. చివరికి, మహిళా సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయించే 'జెండర్ బ్జడెట్'కూ నిధులలోనూ కోత పెట్టడం మోడీ సర్కారు తీరుకు నిదర్శనం. దీంతో రానున్న రోజుల్లోనూ నిరుద్యోగం, అధికధరలు, జీవన వ్యయాలు పెరగడం, ఉపాధి కోత వంటి కష్టాలు తప్పవన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కేంద్రబడ్జెట్‌లో సామాన్యులకు నేరుగా ప్రయోజనం కల్పించే చర్యలు పెద్దగా లేవు. గత ఏడాదిలో ఆదాయ పన్ను, జీఎస్టీల్లో భారీ కోతలతో ఉపశమనం కల్పించిన ప్రభుత్వం ఈసారి వాటి జోలికి వెళ్లలేదు. అయితే పలు విభాగాల్లో మినహాయింపు లను ఇవ్వడం ద్వారా పరోక్షంగా సాయం చేసేందుకు ప్రయత్నించినట్లు చెప్పుకుంది. అయితే అది ఏమేర ప్రతిఫలిస్తుందన్నది చూడాలి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో.. మధ్య తరగతి వారు, చిన్న ఇన్వెస్టర్లకు పలు అంశాల్లో మినహాయింపులను ప్రకటించారు. వ్యవసాయం, విద్య, చిన్న పరిశ్రమలు, ఆరోగ్య రంగం,ఖనాన్షియల్ మార్కెట్లు, ఐటీ రంగం, రవాణా మౌలిక వసతులు, పర్యాటకం, క్రీడా రంగాల ద్వారా సామాన్యులకు పరోక్షంగా ప్రయోజనం కల్పించే చర్యలను మంత్రి వెల్లడించారు. పోటీతత్వం పెంచడంతోనే ఆర్థికవృద్ధిని వేగవంతం చేయగలమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఉత్పాదకతను, పోటీతత్వాన్ని పెంచడం ద్వారా నిలకడగల ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, వారి సామర్థ్యాలను మెరుగుపరచడం, ప్రతి కుటుంబం, సమాజం, ప్రాంతం వృద్ధికి వనరులు, అవకాశాలను పొందేలా చూడటం అనే మూడు 'కర్తవ్యాలు'ను ప్రభుత్వం చేపట్టిందని మంత్రి పేర్కొన్నా.. గత 9 ఏళ్లుగా ఇవేమీ కనిపించడం లేదు. ఏటా కొత్తకొత్త ప్రకటనలతో మభ్య పెట్టడం సాధ్యం కాదని పాలకుల తెలుసుకుంటే మంచిది. ఈ కర్తవ్యాలను సక్రమంగా నెరవేర్చడానికి సంస్కరణల ఎక్స్‌ప్రెస్ వేగంగా ముందుకు సాగుతుందని వ్యాఖ్యానించారు. గత 12ఏళ్ళుగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితమే ఈనాటి అనిశ్చిత పరిస్థితుల్లో కూడా నిలకడగల వృద్ధిని, ఆర్థిక సుస్థిరతను సాధించగలిగామని నిర్మలమ్మ చెప్పుకున్నారు. అయితే ఈ లెక్కలు దేనిని బేరీజు వేసుకుని చెప్పారన్నది అర్థం కావడం లేదు. గ్రామాలకు వెళితే ప్రజల జీవన పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుస్తాయి. వారికి ఇంకా ఉచిత బియ్యం అందిస్తున్నామంటే, వారి అర్థిక పరిస్థితిని గమనించవచ్చు. రైతులు ధాన్యం పండిస్తున్నా గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. తిండి గింజలు కొనుక్కోలేక సామాన్యులు విలవిల్లాడుతున్నారు. అయితే కేన్సర్ పేషెంట్లకు ఊరట కలిగించేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. కేన్సర్ చికిత్స కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే అత్యావశ్యక ఔషధాలపై దిగుమతి సుంకాన్ని మినహాయిస్తారు. దీనిలో భాగంగా 17 రకాల ఔషధాలు ధరలు తగ్గుతాయి. అరుదైన వ్యాధుల చికిత్సకు ఉపయోగించే మరో ఏడు కీలక ఔషధాలపై కూడా దిగుమతి సుంకాలు తగ్గుతాయి. కేన్సర్ చికిత్సలో వాడే మందులు, ఇతర ఔషధాలు, ఆహార పదార్థాలు, పరికరాలపై కూడా సుంకాలు తగ్గుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఆకళింపు చేసుకోకుండా ఎన్ని బడ్జెట్లు ప్రవేశ పెట్టినా భారత పురోగతి కాగితాలకే పరిమితం అవుతుంది.




# బలూచీ ఆత్మాహుతి దాడిలో 50మది మృతి

## ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లు పాల్గొన్నట్లు గుర్తింపు



**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 2:** పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్సులో నరమేధం కొనసాగుతోంది. పాక్ సైన్యం చేపట్టిన ఆపరేషన్‌కు వ్యతిరేకంగా ఆత్మహుతి దాడులు సాగుతున్నాయి. దీంతో ఇప్పటికే వందల్లో మృతి చెందారు. బలూచిలోని 12 వేర్వేరు ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతోన్న దాడులకు బాధ్యత వహిస్తూ.. బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటన వెలువరించింది. పాక్ దళాలపై దాడి చేసింది తమ విభాగానికి చెందిన ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లేనని వెల్లడించింది. వీరిలో 24 ఏళ్ల ఆసిఫా మెంగల్ అనే యువతి చేసిన దాడిలో పాక్ సిబ్బంది సహా 50 మంది మృతి చెందినట్లు తెలిపింది. మరో ఆత్మాహుతి బాంబర్ దాడిలోనూ అనేకమంది ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంది. అయితే ఆ బాంబర్ పేరును మాత్రం వెల్లడించలేదు. బలోచిస్థాన్ అంతటా భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని 'హీరోఫ్' పేరుతో రెండో దశ ఆపరేషన్‌ను ప్రారంభించను న్నట్లు బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఆదివారం పేర్కొంది. ఈ విషయంపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మా ట్లాడుతూ.. ఆత్మాహుతి దాడుల్లో ఇద్దరు మహిళా నేరస్థులు పాల్గొన్నట్లు గుర్తించామన్నారు. ఈ దాడులపై బలోచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగతీ స్పందించారు. పాకిస్థాన్ భద్రతా దళాలు 40 గంటలుగా ఉగ్రవాద ఏరివేత చర్య లు కొనసాగిస్తున్నాయని.. ఇందులోభాగంగా ఇప్పటివరకు 140 మందికి పైగా వేర్పాటువాదులను మట్టుబెట్టాయని వెల్లడించారు. స్థానిక పౌరుల వేషధారణలో ఉన్న బలోచ్ రెబల్స్ పాఠశాలలు, బ్యాంకులు, మార్కెట్లు, ఆసుపత్రులలోకి ప్రవేశించి కాల్పులకు తెగబడుతున్నారని పాక్ మిలిటరీ తెలిపింది. ఏదైనా నగరం లేదా వ్యూహాత్మక స్థావరాన్ని స్వాధీనం చేసుకోవడానికి బలోచ్ రెబల్స్ ప్రయత్నాలు



చేస్తున్నాయని.. అయితే వాటిని తమ దళాలు సమర్థవంతంగా తిప్పికొడుతున్నాయని పేర్కొంది.

# నరవణె పుస్తకంలోని వ్యాఖ్యల ఉల్లేఖిన

## లోక్‌సభలో రాహుల్ ప్రసంగంపై గందరగోళం

## అడ్డుకున్న మంత్రులు రాజ్‌నాథ్, అమిత్ షా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో సోమవారం గందరగోళం తలెత్తింది. విపక్ష నేత రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణెళి రాసిన పుస్తకంలోని ఒక వాక్యాన్ని ప్రస్తావించడంతో గందరగోళం చెలరేగింది. వెంటనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాహుల్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. నరవణెళి పుస్తకం ఇంకా పబ్లిష్ కాలేదని, ప్రచురితం కాని పుస్తకం నుంచి వ్యాఖ్యలను పార్లమెంటరీ ప్రొసీడింగ్స్‌లో ఎలా ప్రస్తావిస్తారని నిలదీశారు. స్జబెక్ట్‌పై మాట్లాడాలన్నారు. రాజ్‌నాథ్ సింగ్ లేవనెత్తిన అభ్యంతరాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సమర్థించారు. 'మ్యాగజైన్ ఏదైనా రాయవచ్చు. పుస్తకం అధికారికంగా ప్రచురితం కానప్పుడు దానికి విశ్వసనీయత ఉండదు' అని అన్నారు. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాహుల్ మాట్లాడటం సరికాదన్నారు. పార్లమెంటరీ విధివిధానాలను పాటించాలని సూచించారు. దీంతో స్పీకర్ జోక్యం చేసుకుని ఆ పుస్తకం ఎక్కడుందో చూపించాలని అడిగారు. ప్రతిపక్ష నేతగా మీరు ఆరోపణలు చేస్తున్నారే కానీ సభ నిబంధనలను పాటించడం లేదన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. దీంతో రాహుల్ వెంటనే స్పందించారు. 'ఏమి మాట్లాడమంటారో దయచేసి మీరే చెప్పండి' అన్నారు. దీనిపై స్పీకర్ వెంటనే జవాబిచ్చారు. నేను మీ సలహాదారుని కాదు. స్పీకర్‌గా సభ సజావుగా సాగేలా చూడటం నా బాధ్యత. నిర్దేశిరచిన స్జబెక్ట్ మీదే చర్చ ఉండాలి' అన్నారు. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

# యూపీ సీఎం యోగి సంచలన నిర్ణయం

## ఉద్యోగుల స్థిరచరాస్తుల వివరాలు సమర్పించాలని ఆదేశం



**లక్నో, ఫిబ్రవరి 2:** ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆధిత్యనాథ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగుల స్థిర,చర ఆస్తులు అంటే ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించే వాహనాలు ఇతర ఆస్తులతో స్థిరాస్తులైన ఇళ్లు, స్థలాల వివరాలను అందించాలని సూచించారు. ఇందుకోసం మానవ్ సంపద పేరుతో ఓ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 8,66,261 ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. డిసెంబర్ 31,2025 నుంచి జనవరి 31,2026 వరకు వారి ఆస్తుల వివరాల్ని పోర్టల్‌లో పొందుపరచాలని ఆదేశించారు. నిర్ధేశించిన గడువు లోపు ఆస్తుల వివరాలు అందించాలని, లేదంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చీఫ్ సెక్రటరీ ఎస్పీ గోయల్ పర్యవేక్షించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం యోగి ఆధిత్యనాథ్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు తమ తమ ఆస్తులు ఇవేనంటూ సంబంధిత ఆస్తుల వివరాల్ని మానవ్ సంపద్ పోర్టల్‌లో ఆధాలతో సహా అప్‌లోడ్ చేశారు. వారిలో 68వేల మంది ఉద్యోగులు వారి వివరాల్ని ఇవ్వలేదు. ఉద్యోగుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన యూపీ సీఎం వారి జనవరి జీతాల్ని నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల ఆస్తుల వివరాలు ఇచ్చే వరకు జీతాలు ఇవ్వకూడదని సంబంధిత శాఖ అధికారులకు స్పష్టం చేశారు. అంతేకాదు, ప్రమోషన్ల నిలిపివేయడం, వారిపై పెనాల్టీ విధిస్తామని హుకుం జారీ చేశారు.

# చీరల గురించి కాదు.. బడ్జెట్‌పై చర్చించండి

## సోషల్ మీడియా వార్తలపై నిర్మలమ్మ అసహనం




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** ఏటా బడ్జెట్ వేళ ఆర్థిక కేటాయింపుల పైనే కాకుండా.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధరించే చీరలపై అందరి దృష్టి ఉంటుంది. ఎందుకంటే ఆమె చేనేతకు సంబంధించిన ప్రత్యేకించిన చీరలను ధరిస్తారు. అలాగే ఎంతో హుందాగా దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ఏటా ఆమె ధరించే చీరలపై చర్చ సాగుతూనే ఉంటుంది. దేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా ఆమె ఎంచుకునే చీరలపై చర్చలు జరుగుతాయి. ప్రతి ఏడాది బడ్జెట్ సమయంలో తన చీరలపై జరుగుతోన్న చర్చలపై ఆర్థికమంత్రి అసహనం వ్యక్తంచేశారు. ప్రతి సంవత్సరం బడ్జెట్రోజు నేను ఏం ధరించబోతున్నా ననే ప్రశ్నలు నాకు ఒత్తిడిగా మారుతున్నాయన్నారు. 'ఎందుకు ఇలా ప్రశ్నలతో వేధిస్తున్నారు? ఒకవేళ బ్జడెట్ ప్రవేశపెట్టేది పురుష మంత్రులైతే వారిని కూడా ఇలాగే వారి దుస్తుల గురించి అడిగేవారా? నేను ధరించే చీరను కూడా బ్జడెట్‌లో ఒక అంశంలా మార్చేస్తున్నారు' అంటూ సీతారామన్ అసహనం వ్యక్తంచేశారు.బడ్జెట్లో ఉన్న అంశాలు ఏమిటి అనే విషయాలను తెలుసుకోవడంపై ప్రజలు దృష్టి పెట్టాలని.. తన చీరలపై కాదని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి అనవసర విషయాల గురించి ఆలోచించడం వల్ల ముఖ్యమైన విషయాలపై పట్టు కోల్పోతామన్నారు. కాగా ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేళ ఆమె కాంచీపురం చీరలో కన్పించారు. బంగారు, కాఫీ వర్ణం అంచుతో ఉన్న మెజెంటా రంగు చీర, గోల్డెన్ కలర్ బ్లౌజ్, శాలువాతో కన్పించారు. అది తమిళనాడు నేపథ్యం ఉన్న చీర. కొన్ని నెలల్లో ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఆమె కాంచీపురం చీరను ఎంచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై నెట్టింట చర్చ జరుగుతోన్న సమయంలో నిర్మలా సీతారామన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం

# బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్

## బుల్లెట్ ట్రైన్ల కేటాయిపులపై మంత్రి అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** బుల్లెట్ ట్రైన్‌కు హైదరాబాద్ మహా నగరం హబ్‌గా మారుతుందని రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన రైల్వే ప్రాజెక్టులతోపాటు నిధుల కేటాయింపులనువివరించారు. సోమవారం న్యూఢిల్లీలో మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.5,454 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. అలాగే మూడు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు ఇచ్చామని చెప్పారు. అవి.. హైదరాబాద్ - బెంగళూరు (రెండున్నర గంటల ప్రయాణం..) , హైదరాబాద్ - చెన్నై (2:55 గంటల ప్రయాణం..), హైదరాబాద్ - పుణె (1:45 గంటల ప్రయాణం..) అంటూ సోదాహరణగా వివరించారు. కేంద్ర బ్జడెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌కు సమర్పించారు. ఈ బడ్జెట్‌లో కేటాయింపును ఆయన వివరించారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లు అన్నీ ఎలివేటెడ్ కారిడార్‌గా నిర్మిస్తామన్నారు. అందుకు సంబంధించిన పనులను త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇది సౌత్ ఇండియా డైమండ్ హై స్పీడ్ రైల్వే ప్రాజెక్ట్ అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కంటే అధికంగా తెలంగాణ రాష్ట్రానికి రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించామని ఈ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. అయినా 2026-27 బడ్జెట్‌లో కేంద్రం మొండి చేయి చూపిందంటూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని పలువురు అగ్రనేతలు ఆరోపిస్తున్నారు. అలాంటి వేళ రైల్వే శాఖ ద్వారా తెలంగాణకు జరిగిన బ్జడెట్ కేటాయింపులను ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోదాహరణగా వివరించారు.



## ప్రభుత్వ పాఠశాలలో చోరీ



**నేటి సాక్షి,నారాయణపేట (ఇమామ్):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చోరీ జరిగిందని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ప్రదీప్ కుమార్ తెలిపారు. తలుపులు పగలగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు ఆయన వివరించారు. పాఠశాలల్లో ఉన్న రింగ్స్ బాల్స్, చెస్ బోర్డులు, రికార్డ్స్, పలు సామాగ్రి ఎత్తుకెళ్లినట్లు ఆయన వివరించారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన



**నేటి సాక్షి:శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో గల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయ ఆవరణలో సోమవారం సిద్ధార్థ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఉదయం గం. 9 నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిర్వహించారు. ఈ క్యాంపులో జనరల్ మెడిసిన్, ఈఎన్ టి, గైనిక్, ఆర్తోపెడిక్ డాక్టర్ లు సుజిత సిద్ధార్థ రెడ్డి, అజయ్ కుమార్, హిమసింధు, అర్షియా షేక్, కృష్ణప్రసాద్, జిఆర్ బిఎస్, బిపి, బరువు, రక్త పరీక్షలతో పాటు పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలో ఉన్న ప్రజలతో పాటు, పక్క గ్రామాల వాసులు 125 మందికి పరీక్షలు నిర్వహించి, టెస్టులతో పాటు మందులు ఉచితంగా అందజేశారు. మేనేజర్ భీమయ్య హెల్త్ క్యాంపు జయప్రదానికి కృషి చేశారు.

## హామీల మోసం.. అవినీతి రాజ్యం



**నేటి సాక్షి గజ్వేల్ :** గత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో గజ్వేల్‌ను అవినీతి కేంద్రంగా మార్చిందని, పేదలు-దళితులకు ఇచ్చిన హామీలన్నింటినీ మరిచి ప్రజలను మోసం చేసిందని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఐదవ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సారిక శ్రీనివాస్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో పేదలకు 5 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తానని, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానని ఇచ్చిన హామీలను మాజీ సీఎం కేసీఆర్ పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. గెలిచిన తరువాత ఒక్కసారి కూడా పేదల గడప తొక్కలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందని, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రతి పేదవాడి కడుపు నింపేలా సన్న బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసి రుణ విముక్తి కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత 15 ఏళ్ల పాలనలో ఒక్క కుటుంబానికైనా కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఏడాదిలోపే ప్రజలు కోరుకున్న ప్రజాపాలన అందిస్తోందని అన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. గత ప్రభుత్వ మోసాలు, అవినీతిని ప్రజలు గుర్తించాలనీ, కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటేసి తనను ఐదవ వార్డు కౌన్సిలర్‌గా గెలిపించాలని సారిక శ్రీనివాస్ రెడ్డి ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, కొల్లూరి సత్యనారాయణ, రాంబాబు, మామిడి సురేష్, గోపిశెట్టి అశోక్, గజ్వేల్ సాయిలు, బద్రి తదితరులు పాల్గొన్నారు.

# ష్.... అంతా గప్ చుప్.!

- మున్సిపాలిటీల్లో అంతా సైలెంట్
- కాంగ్రెస్ నాయకుల్లో బీ-ఫామ్ ల లొల్లి
- కన్ఫ్యూజ్ అవుతున్న ఓటర్లు
- ఓటర్లను బుజ్జగిస్తున్న ఇరువర్గాలు
- ఈరోజు బీ-ఫామ్ లకు తెర
- వర్గ పోరుతో ఇతర పార్టీలకు గెలుపే అవకాశం

**నేటి సాక్షి-జగిత్యాల (ఇమ్మడి విజయ్ కుమార్ ) :** రానున్న రెండో విడత మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మొదటి ఘట్టం నామినేషన్ల పర్వం పూర్తయింది. నామినేషన్లు పూర్తయిన రెండు రోజులుగా మున్సిపాలిటీలు అంతా సైలెంట్ గా మారాయి. బిజెపి,బిఆర్ఎస్ పార్టీ తరపున నామినేషన్ వేసిన అభ్యర్థులు పార్టీ తరపున ప్రచారాలు ప్రారంభించారు. టిఆర్ఎస్ నాయకులు గత 3 సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రచారం సాగిస్తున్నారు. బిజెపి అభ్యర్థులు కేంద్ర ప్రభుత్వంలో బిజెపి ఉందని మమ్మల్ని గెలిపిస్తే మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చేస్తామని పార్టీ తరపున ప్రచారం సాగిస్తున్నారు.

### కాంగ్రెస్ అభ్యర్థుల్లో బీ-ఫామ్ ల లొల్లి

కాంగ్రెస్ అభ్యర్థులు మాత్రం బీ-ఫామ్ ల లొల్లి ఇంకా కొలిక్కి రాలేదు. జగిత్యాల మున్సిపాలిటీలో ఓవైపు జీవన్ రెడ్డి వర్గం మరోవైపు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గం అభ్యర్థులు బీ-ఫామ్ ల భయం పట్టుకుంది. దీంతో ప్రచారం చేయడానికి ఆసక్తి చూపక అంతా సైలెంట్ గా ఉండడంతో కాంగ్రెస్ లో సైలెంట్ వాతావరణం నెలకొంది. సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి జెండా మోసిన కార్యకర్తలకే బీ-ఫామ్ ఇవ్వాలని అధిష్టానం పై ఒత్తిడి చేయగా.. మరోవైపు ఎమ్మెల్యే బి ఫామ్ లు మాకు కూడా కావాలంటూ అధిష్టానం పై ఒత్తిడి తీసుకొచ్చాడు. దీంతో జగిత్యాలలో కాంగ్రెస్ లో వర్గపోరు హాట్ టాపిక్ గా మారింది.

### కన్ఫ్యూజ్ అవుతున్న ఓటర్లు

రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ ఉండడంతో కాంగ్రెస్ తమ నాయకులను గెలిపించుకోవాలనుకున్న ఓటర్లకు వర్గ పోరు కన్ఫ్యూజ్ చేస్తుంది. ఒక్కో వార్డులో కాంగ్రెస్ తరపున దాదాపు రెండు మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయి. దీంతో తమ నాయకునికే బీఫామ్ వస్తుందన్న నమ్మకం ఓటర్లలో లేకుండా పోయింది. ఒకవేళ తాము అనుకున్న నాయకునికి బీ-ఫామ్ రాకపోతే ఏ నాయకుడిని ఎన్నుకోవాలో అర్థం కాని పరిస్థితి ఓటర్లలో నెలకొంది.

### ఓటర్లను బుజ్జగిస్తున్న ఇరు వర్గాలు

బిఆర్ఎస్ ప్రభుత్వం టిఆర్ఎస్ తరపున పోటీ చేసిన నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ కు ఓటు వేయాలంటూ ఓటర్లను బుజ్జగిస్తున్నారు. మేము నిలబడుతున్నాము అని ప్రచారం కంటే ఎక్కువ చేతి గుర్తు కాంగ్రెస్ అంటూ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో సీనియర్ జీవన్ రెడ్డి వర్గాన్ని గెలిపించాల లేదా సంజయ్ కుమార్ వర్గాన్ని గెలిపించాలా అనే కన్ఫ్యూజ్ ప్రజల్లో నెలకొంది.

### ఈరోజున బీ-ఫామ్ లకి తెర

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఫిబ్రవరి మూడో తేదీన బీ-ఫామ్ ల కు తెర పడనుంది. అప్పటిదాకా ప్రచారం చేయాలా వద్దా అయోమయంలో కాంగ్రెస్ తరపున నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు అంతా సైలెంట్ గా ఉన్నారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థులు అంతా సైలెంట్ వాతావరణం నెలకొంది. బీ-ఫామ్ లు వచ్చిన తర్వాత కాంగ్రెస్ లో ప్రచారం ఊపొందుకుంటుందని ఓటర్లు భావిస్తున్నారు. ఏది ఏమైనా ఈ ఎన్నికలు జగిత్యాల లో కీలకంగా మారనున్నాయి. కార్యకర్తల్లో రాజకీయ భవిష్యత్తును నిర్ణయించడంలో మున్సిపల్ ఎన్నికలు కీలకంగా మారుతాయని చెప్పకనే చెప్పొచ్చు.


### వర్గ పోరుతో ఇతర పార్టీల గెలుపుకు అవకాశం

జగిత్యాల లో కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలు ఉన్నందున ఇతర పార్టీ అభ్యర్థులకు గెలుపుకు అవకాశం చాలా ఉంది. బిజెపి, బీఆర్ఎస్ అభ్యర్థులు తమ వార్డుల్లో ప్రచారం కొనసాగిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటే వారు తమ గెలుపుకు దగ్గరైనట్లే నని అందరూ భావిస్తున్నారు. ఏదేమైనా మున్సిపల్ ఎన్నికల్లో ఏ పార్టీ విజయం సాధిస్తుందని 13వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.!

# కోకాపేట్‌లో అక్రమ నిర్మాణాల రాజ్యం

- 250 గజాల్లో ఐదు అంతస్తుల అక్రమ భవనం
- మౌనం పాటిస్తున్న సర్కిల్ అధికారులు

**నేటి సాక్షి, నార్సింగి శివకుమార్:** నార్సింగి సర్కిల్ పరిధిలోని కోకాపేట్ గ్రామంలో అక్రమ నిర్మాణాలు హద్దులు దాటుతున్నాయి. కేవలం 250 గజాల స్థలంలో అనుమతులకు విరుద్ధంగా సెల్లార్‌తో కూడిన ఐదు అంతస్తుల భారీ భవనం ఏటువంటి అడ్డంకులు లేకుండా నిర్మాణంలో కొనసాగుతుండటం స్థానికంగా తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఇంత భారీ అక్రమ నిర్మాణం జరుగుతున్నా సంబంధిత సర్కిల్ అధికారులు మౌనం పాటిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతులు లేకుండా సెల్లార్ తవ్వడం ఎలా సాధ్యమైంది?, ఐదు అంతస్తులకు అనుమతి ఎలా ఇచ్చారు?, ఫైర్ సేఫ్టీ అనుమతులు ఎక్కడ? వంటి ప్రశ్నలు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి. చిన్నపాటి ఇల్లు నిర్మించాలన్నా సామాన్య ప్రజలను నిబంధనల పేరుతో వేధించే అధికారులు, ఈ అక్రమ భవనంపై మాత్రం కళ్లుమూసుకోవడం అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు అందినప్పటికీ నిర్మాణాన్ని నిలిపివేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ భవనాన్ని వెంటనే సీజ్ చేసి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





# మూఢనమ్మకాలతో సమాజం తిరోగతి



- మంత్రతంత్రాలను నమ్మొద్దు : వక్తలు

**నేటి సాక్షి న్యూస్, చౌడేపల్లి:** మూఢనమ్మకాలు సమాజాన్ని తీవ్రంగా వెనక్కి నెడుతున్నాయని, మంత్రతంత్రాలు, క్షుద్రపూజలు వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మరాదని పలువురు వక్తలు అన్నారు. చౌడేపల్లి మండలం కాగితి పంచాయతీ పరిధిలోని కాగతి ప్రాథమికోన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢనమ్మకాలు-మంత్రతంత్రాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల పాఠశాలకు చెందిన ఓ బాలుడి మృతి నేపథ్యంలో విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరవడంతో, ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దెయ్యాలు, మంత్రాలు, తంత్రాలు వంటి మూఢవిశ్వాసాలను నమ్మకుండా ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. విద్య ఒక్కటే జీవన ప్రమాణాన్ని మెరుగుపరచే మార్గమని, మూఢనమ్మకాల కారణంగా విద్యార్థులు చదువుకు దూరం కావద్దని అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల్లో ధైర్యాన్ని నింపాలని, భయాలు కలిగించే మూఢవిశ్వాసాలకు ఆస్కారం ఇవ్వకూడదని సూచించారు. మ్యాజిక్ ప్రదర్శనల ద్వారా మూఢనమ్మకాల వెనుక ఉన్న అవాస్తవాలను విద్యార్థులు, తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం విద్యకు ప్రాధాన్యం ఇచ్చి ప్రతిరోజూ పాఠశాలకు రావాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు హరినాథ్, శర్మ, యుగంధర్, గిరిధర్ మూర్తి, ఎస్‌కే యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటరెడ్డి, ఎంపీడీవో లీలా మాధవి, ఎస్సై నాగేశ్వరరావు, ప్రకృతి వనం ప్రసాద్, ఎంఈఓ కేశవరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రిసైడింగ్ అధికారుల పాత్ర

- విధుల్లో సంపూర్ణ అవగాహనతో బాధ్యతలు నిర్వర్తించాలి
- ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు ఐఏఎస్




**నేటి సాక్షి -జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య ):** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు, అదనపు ప్రిసైడింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు ఐఏఎస్ స్పష్టం చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్ అధికారులు, అదనపు ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతులను పరిశీలిస్తూ పలు అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు.

### ఎన్నికల విధులపై సమగ్ర అవగాహన అవసరం

ఈ సందర్భంగా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల విధులు అత్యంత కీలకమైనవని, ప్రతి అంశంపై క్షుణ్ణంగా అవగాహన కలిగి విధులను నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి సేకరణ, పూర్తి సామాగ్రి ఉందో లేదో సరిచూసుకోవడం, ఓటర్ లిస్ట్, బ్యాలెట్ పేపర్స్ పరిశీలన, బ్యాలెట్ బాక్స్ సీలింగ్ విధానం వంటి అంశాలపై స్పష్టత ఉండాలన్నారు.

### పోలింగ్ రోజు నుంచి లెక్కింపు వరకు జాగ్రత్తలు

అదేవిధంగా ఛాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, బ్యాలెట్ పేపర్స్ జారీ విధానం, పీఓ డైరీ నింపడం, అన్ని ఫార్మ్‌లను సరైన విధంగా నింపడం, పోలింగ్ ఏజెంట్ల సంతకాలు తీసుకోవాల్సిన చోట్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ పూర్తయిన అనంతరం బ్యాలెట్ బ్యాక్ సీలింగ్, ఓట్ల లెక్కింపు వంటి అంశాలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు వారికి కేటాయించిన ప్రదేశాల్లోనే తప్పనిసరిగా బస చేయాలని జనరల్ అబ్జర్వర్ పేర్కొన్నారు.

### నిష్పక్షపాత, పారదర్శక ఎన్నికల నిర్వహణే లక్ష్యం

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయిలో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు. 'పోలింగ్ డే' నాడు అనుసరించాల్సిన విధివిధానాలు, పోలింగ్ స్టేషన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు సంబంధించిన అంశాలపై స్పష్టమైన సూచనలు చేశారు.

### సమన్వయంతో విధులు నిర్వహించాలి

పోలింగ్ ఆఫీసర్లు ఎన్నికల విధులను అత్యంత బాధ్యతతో నిర్వహించాలని, ప్రతి పీఓ తమ పాత్రను సమర్థంగా నిర్వర్తించాలని జిల్లా అదనపు కలెక్టర్ సూచించారు. ప్రతి పీఓ తమ అదనపు పీఓలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

### టీవోటీల ద్వారా విస్తృత శిక్షణ

ఈ శిక్షణ కార్యక్రమంలో టీవోటీలు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రిసైడింగ్ అధికారుల విధులు, బాధ్యతలు, ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తిస్థాయిలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, జీవాకర్ రెడ్డి, నోడల్ అధికారులు రాము, రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, మున్సిపల్ కమిషనర్లు, టీవోటీలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల అదనపు ఎస్పీకి ఎస్పీగా పదోన్నతి



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా విధులు నిర్వహించిన శేషాద్రిని రెడ్డి ఎస్పీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో పిప్పింగ్ కార్యక్రమం నిర్వహించారు.

- శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్

### స్టార్ చిహ్నంతో అభినందన

పిప్పింగ్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శేషాద్రిని రెడ్డి భుజాలపై ఎస్పీ హోదాకు సంబంధించిన స్టార్ చిహ్నాన్ని అలంకరించి అభినందించారు. ఎస్పీగా పదోన్నతి పొందిన సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

### కొత్త బాధ్యతల్లో మెరుగైన సేవలు

ఈ సందర్భంగా కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ ట్రాఫిక్ డీసీపీగా బదిలీ అయిన శేషాద్రిని రెడ్డి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు.

# గజ్వేల్‌లో రాజకీయ భగ్గుమంటలు

- కేసీఆర్-హరీశ్ రావు-కేటీఆర్ దిష్టిబొమ్మల దహనం
- ఫోన్ టాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు



**నేటి సాక్షి గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదిపుర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ పార్టీ ఇటీవల చేపట్టిన నిరసనకు ప్రతిగా కాంగ్రెస్ నాయకులు ఆందోళన కార్యక్రమం చేపట్టి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ నిరసన కార్యక్రమం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట అంక్ష రెడ్డి సూచనల మేరకు నిర్వహించినట్లు తెలిపారు. గజ్వేల్ ఆత్మ కమిటీ డైరెక్టర్ గజ్వేల్ రామచంద్రం రెడ్డి మాట్లాడుతూ, అహ్మదిపుర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఫోన్ టాపింగ్ వ్యవహారం ద్వారా రాజకీయ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్తలపై అక్రమ నిఘా పెట్టి లబ్ధి పొందారని ఆరోపించారు. వ్యాపార నేతల నుంచి భారీ మొత్తాలు వసూలు చేశారని, ప్రస్తుతం విచారణ ఎదురవుతున్న సమయంలో తమకు సంబంధం లేదని కేసీఆర్ చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనని విమర్శించారు. ఫోన్ టాపింగ్‌లో అధికారులు కూడా భాగస్వాములేనని, తప్పుడు ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. మునుగోడు ఉప ఎన్నికలతో పాటు రాష్ట్రంలో జరిగిన పలు ఎన్నికల్లో ప్రతిపక్ష నాయకుల ఫోన్లు టాప్ చేసి బీఆర్ఎస్ రాజకీయ లబ్ధి పొందిందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి ఇప్పుడు నిర్దోషుల్లా మాట్లాడటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన పాపానికి ఎప్పటికైనా మూల్యం చెల్లించుకోవాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో చెప్పినట్టుగానే ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని తెలిపారు. విచారణ ముగిసిన అనంతరం కేసీఆర్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు జైలుకు వెళ్లడం ఖాయమని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు అందోల్ నరసింహులు, బాల్ గౌడ్, టెంట్ మల్లేశం, బోయిని రామచంద్రం, భొర్రణ బాల్ రాజు గౌడ్, శిల్వేరి అంజా గౌడ్, బుచ్చిరెడ్డి, కొత్తపల్లి వెంకట్ గౌడ్, ఆర్మల రామచంద్రం, కనకరాజు, సంతోష్, బిక్షపతి, బాలయ్య, నరేందర్ రెడ్డి, బాలకిష్ట రెడ్డి, కుర్మ బిరయ్య, శ్రీనివాస్ రెడ్డి, కమ్మరి సత్తి, వైస్ ప్రెసిడెంట్ ఎర్ర కనకరాజు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# వైద్య శిబిరానికి విశేష స్పందన



**నేటి సాక్షి, ఆత్మకూరు:** నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలోని థెరీసా జూనియర్ కాలేజీలో పి.ఆర్.టీ.యూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాష తెలిపారు. సుశ్రుత ఫౌండేషన్, ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ (హైదరాబాద్) సంయుక్తంగా నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి పి. నాగూర్ ఖాన్, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాష, ఆత్మకూరు మండల విద్యాధికారి ఎం. అయూబ్ అహ్మద్, టీడీపీ టౌన్ క్లస్టర్ ఇంచార్జీ కమతం శంకర్, థెరిసా విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ సాయి ప్రణీత్‌లు ప్రారంభించారు. ఆత్మకూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు శిబిరానికి హాజరై ఉచిత కన్సల్టెన్సీతో పాటు సుమారు రూ.5 వేల విలువైన వైద్య సేవలు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. వేరికో వీన్స్‌తో బాధపడుతున్న 27 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్.టీ.యూ రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇబ్రహీం, పి. నూర్ మొహమ్మద్, హుస్సేన్ సాహెబ్, ఎస్.వి. రామిరెడ్డి, దామరేకుల రవి, ఆత్మకూరు మండల అధ్యక్షుడు సి. ప్రదీప్ కుమార్, కొత్తపల్లి మండల అధ్యక్షుడు సయ్యద్ కలిముల్లా, వెలుగోడు మండల అధ్యక్షుడు సయ్యద్ మొహినుద్దీన్, పాములపాడు మండల ప్రధాన కార్యదర్శి హరినాథ్ బాబు, జిల్లా నాయకులు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# సైకత శిల్ప ప్రతిష్టకు ఆహ్వానం



**నేటి సాక్షి, జగిత్యాల (పూరెల్ల బాపు):** కలియుగ వెంకటేశ్వర స్వామి 20 అడుగుల సైకత ఇసుక శిల్ప ప్రతిష్టారాధన కార్యక్రమానికి రావాల్సిందిగా మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డిని నిర్వాహకులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 5 నుండి మార్చి 5 వరకు జగిత్యాల జిల్లా కేంద్రంలో ని ఎగ్జిభిషన్ గ్రౌండ్ లో నెలకొల్పే సైకత ఇసుక శిల్ప ఆరాధన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు వేముల ఉమారాణి తెలిపారు. సోమవారం ఇందిరా భవన్ లో కార్యక్రమ ప్రధాన ఆర్గనైజర్ వేముల ఉమారాణి మాజీ మంత్రి జీవన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి 3డి సైకత ఇసుక శిల్ప ప్రతిష్టారాధన కార్యక్రమానికి రావాలని ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొత్త మోహన్, కళ్ళేపెల్లి దుర్గయ్య, వరప్రసాద్, వెంకట్ రెడ్డి లున్నారు.

# మైనార్టీ యువతకు ఉపాధి శిక్షణ

**నేటి సాక్షి, ఆదిలాబాద్:** నిరుద్యోగ మైనారిటీ యువతకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మూడు నెలల ఉచిత నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రం హమీద్‌పురాలోని ఉర్దూ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ వంటి కోర్సుల్లో మూడు నెలల ఉచిత నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని 'జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్' కోర్సును ప్రవేశపెట్టామని, దీని ద్వారా ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలే కాకుండా స్వయం ఉపాధి పొందవచ్చని తెలిపారు. అదేవిధంగా మహిళల కోసం స్వయం ఉపాధిని ఇచ్చే 'టైలరింగ్' శిక్షణ కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై, ప్రాక్టికల్ అంశాలపై దృష్టి సారించాలని కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లతో పాటు ఉపాధి మేళాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కలీమ్, ఫ్యాకల్టీలు, శిక్షణార్థులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంకెన్నాళ్లు ఈ నరకయాతన?



- పాములపాడు-చెలిమిల్ల పాడైన రోడ్లను వెంటనే నిర్మించాలి : లింగాల నాగరాజు డిమాండ్



**నేటి సాక్షి, పాములపాడు:** పాములపాడు నుంచి చెలిమిల్ల వరకు సరైన తారు రోడ్డు లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా ఎస్సీ-ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు లింగాల నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. పాడైపోయిన రోడ్లను వెంటనే తొలగించి కొత్త రోడ్లు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా పాములపాడు మండలంలోని చెలిమిల్ల రస్తాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాములపాడు నుంచి చెలిమిల్ల వరకు కేవలం మెటల్ రోడ్డు మాత్రమే ఉండటంతో పాటు, చెలిమిల్ల పరిసర ప్రాంతాల్లోని సుమారు 30 గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నేషనల్ హైవే రోడ్డుకు మట్టి తరలించేందుకు పీఎస్‌కే కంపెనీ భారీ వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వడం వల్ల గ్రామీణ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని ఆరోపించారు. పాములపాడు–చెలిమిల్లతో పాటు కృష్ణరావుపేట నుంచి ఆనందపురం వరకు రోడ్లు చిందరవందరగా మారాయని పేర్కొన్నారు. ప్రస్తుత రోడ్ల పరిస్థితి అత్యంత దారుణంగా ఉండటంతో అత్యవసర ఆరోగ్య సేవలు, గర్భిణీ స్త్రీల డెలివరీలకు వెళ్లే సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్ల నిర్మాణంపై పీఎస్‌కే కంపెనీ కానీ, అనుమతులు ఇచ్చిన ఆర్టీవో అధికారులు కానీ బాధ్యత వహించాల్సిందేనని హెచ్చరించారు. గ్రామీణ రోడ్లను పాడుచేసిన పీఎస్‌కే కంపెనీపై, అలాగే నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చిన అధికారులపై లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని లింగాల నాగరాజు స్పష్టం చేశారు. చెలిమిల్ల, పాములపాడు, కృష్ణరావుపేట, ఆనందపురం, సిద్ధేశ్వరం గ్రామాల ప్రజలకు తక్షణమే న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# మ్యాచ్ బాయ్‌కాట్ చేస్తే పాక్‌కు చుక్కలే

### 15న శ్రీలంకలో భారత్‌తో పాకిస్తాన్ మ్యాచ్ ఆడదని ప్రభుత్వం ప్రకటన



తమ జట్టు 2026 టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొంటుందని, అయితే ఫిబ్రవరి 15న శ్రీలంకలో భారత్‌తో జరిగే మ్యాచ్ కోసం మైదానంలోకి దిగదని పాకిస్తాన్ ప్రభుత్వం గత ఫిబ్రవరి 01న అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటన తర్వాత క్రికెట్ ప్రపంచంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాస్తవానికి పాకిస్తాన్ తెలివి తక్కువగా ఇంత పెద్ద ప్రకటన చేసింది, కానీ దీనివల్ల కలిగే నష్టాన్ని వారు ఊహించలేదు అని మాజీ క్రికెటర్లు అంటున్నారు. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల పాకిస్తాన్‌కు 5 పెద్ద నష్టాలు ఉన్నాయి. దైనిక్ జాగరణ్ ప్రకారం, పాకిస్తాన్ ఈ నిర్ణయం ప్రకటించడం అంటే భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించినందుకు ప్రపంచ కప్ నుండి ఆ జట్టుపై నిషేధం పడవచ్చు. టోర్నమెంట్ నుండి బంగ్లాదేశ్ ఇప్పటికే తన పిచ్చి నిర్ణయం కారణంగా నిష్క్రమించింది. ఇప్పుడు పాకిస్తాన్ ప్రపంచ కప్ నుండి నిషేధం ఎదుర్కొనే ప్రమాదంలో పడింది. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించినందుకు పాకిస్తాన్ ఆదాయంపై కూడా ఐసిసి నిషేధం విధించవచ్చు. నివేదికల ప్రకారం, ఐసిసి ద్వారా పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు సంవత్సరానికి 34.51 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు 316 కోట్ల రూపాయలు) ఆదాయం వస్తుంది. ఈ ఆదాయం నిలిచిపోతే పాకిస్తాన్ పూర్తిగా దివాలా తీసినట్లే. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే, పాకిస్తాన్ జట్టు జియోస్టార్‌కు నష్టపరిహారం చెల్లించాల్సి రావచ్చు. ప్రపంచ కప్‌లో భారత్-పాకిస్తాన్ మ్యాచ్ ద్వారా అత్యధికంగా సంపాదన వస్తుంది. ఈ మ్యాచ్‌లో 10 సెకన్ల ప్రకటన స్లాట్ సైతం చాలా ఖరీదైనది. మ్యాచ్ జరగకపోతే వారికి చాలా నష్టం వాటిల్లుతుంది. పాకిస్తాన్ మీద ద్వైపాక్షిక సిరీస్‌లపై కూడా పూర్తి నిషేధం విధించవచ్చు. ఈ నిషేధంతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు మరింత దివాళా తీస్తుంది. ప్రపంచ కప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల పాకిస్తాన్ పాకిస్తాన్ సూపర్ లీగ్ లో సైతం నష్టపోవచ్చు. వాస్తవానికి, టోర్నమెంట్ కోసం విదేశీ ఆటగాళ్ల ఎన్ఓసి అంటే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌పై నిషేధం విధించవచ్చు. భారత్ తో మ్యాచ్ లు ఆడకూడదనే నిర్ణయం గురించి పిసిబి ఇంకా ఐసిసికి తెలియజేయలేదని పలు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ బహిష్కరణను పిసిబి అధికారికంగా ఐసిసికి తెలియజేసిన తర్వాతే చర్యలు చేపడుతుంది.. 2026 టి 20 ప్రపంచ కప్ నుండి పాకిస్తాన్ ను మినహాయించవచ్చు అని ప్రచారం జరుగుతోంది. పాకిస్తాన్ టి 20 లీగ్ (పిఎస్ఎల్) లో విదేశీ ఆటగాళ్లకు ఎన్ఓసిలు ఇవ్వడానికి కూడా ఐసిసి నిరాకరించవచ్చు. బంగ్లాదేశ్ ను వెనకుండి ప్రోత్సహించిన కారణంగా, వారికి ఓ న్యాయం, తమకు ఓ న్యాయం ఉండదని చెప్పడానికి.. బంగ్లా దారిలో పయనించి పాకిస్తాన్ ఈ నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ఐసిసి షెడ్యూల్ ప్రకటించిన తర్వాత తమ మ్యాచ్ లను భారత్ వెలుపల తరలించడానికి నిరాకరించిన తరువాత టి 20 ప్రపంచ కప్ లో పాల్గొనకూడదని బంగ్లాదేశ్ తన నిర్ణయాన్ని ప్రకటించింది. దీని తరువాత, పాకిస్తాన్ ఆటగాళ్ళు, పీసీబీ చీఫ్ మోహ్సిన్ నఖ్వీ ఐసిసిని విమర్శించారు. టోర్నమెంట్ ను బహిష్కరిస్తాం అన్నారు. అయితే, సెమీఫైనల్ లేదా ఫైనల్‌లో భారత్‌తో మ్యాచ్ ఉంటే ఏం చేయనున్నారో పాకిస్తాన్ ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. అప్పుడు వారు ఆడతారా లేదా? ప్రస్తుతం పాక్ ప్రభుత్వం ఫిబ్రవరి 15న జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరిస్తామని మాత్రమే ప్రకటించి అగ్నికి ఆజ్యం పోసినట్లు అయింది.

# అఫ్రిది టు బుమ్రా

### వరల్డ్‌కప్ చరిత్రలో ‘ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్’ అవార్డు వీరులు వీరే!

మొట్టమొదటి ఆటగాడిగా షాహిద్ అఫ్రిది

2014 వరల్డ్‌కప్‌లో విరాట్ కోహ్లి కింగ్

2024 వరల్డ్‌కప్‌లో జస్ప్రీత్ బుమ్రాకు అవార్డు

**‘టీ20 వరల్డ్‌కప్’ అంటేనే క్షణక్షణం ఉత్కంఠ పోరు. ఈ మెగా టోర్నమెంట్‌లో జట్టు విజయం ఎంత ముఖ్యమో.. వ్యక్తిగతంగా అద్భుత ప్రదర్శన చేసిన ఆటగాడికి దక్కే ‘ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్’ అవార్డుకు కూడా అంతే ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. ఇప్పటివరకు చాలా మంది ప్లేయర్స్ ఈ అవార్డు అందుకున్నారు. మొట్టమొదటి ఆటగాడిగా పాకిస్థాన్ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది రికార్డుల్లో ఉన్నాడు. ఇప్పటివరకు జరిగిన ప్రతి టీ20 వరల్డ్‌కప్‌లో ఈ అవార్డు గెలిచిన ఆటగాళ్లు చరిత్రలో నిలిచిపోయారు.**

2007 దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి టీ20 వరల్డ్‌కప్‌లో షాహిద్ అఫ్రిది ఈ అవార్డును దక్కించుకున్నాడు. అఫ్రిది 91 రన్స్, 12 వికెట్స్ పడగొట్టాడు. 2009లో ఇంగ్లాండ్ వేదికగా జరిగిన టోర్నీలో శ్రీలంక స్టార్ తిలకరత్నే దిల్షాన్ 317 రన్స్ చేసి ‘ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్’గా నిలిచాడు. 2010 వెస్టిండీస్‌లో ఇంగ్లాండ్ తరఫున ఆడిన కెవిన్ పీటర్సన్ కీలక ఇన్నింగ్స్‌లతో (248 రన్స్) తన ముద్ర వేశాడు. 2012 శ్రీలంకలో జరిగిన వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ అద్భుత ప్రదర్శనతో (249 రన్స్, 12 వికెట్స్) ఈ అవార్డు గెలుచుకున్నాడు.

2014 వరల్డ్‌కప్‌లో కింగ్ విరాట్ కోహ్లి అసాధారణ నిలకడతో (319 రన్స్) ‘ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్’గా నిలిచాడు. 2016 భారత వేదికగా జరిగిన టీ20 వరల్డ్‌కప్‌లో కూడా మరోసారి విరాట్ (273 రన్స్, 1 వికెట్) ఘనతను సాధించి అరుదైన రికార్డు నెలకొల్పాడు. 2021లో జరిగిన టీ20 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ కీలక పరుగులతో (289) జట్టును విజేతగా నిలబెట్టడంలో ప్రధాన పాత్ర పోషించాడు. 2022 ఆస్ట్రేలియాలో జరిగిన టోర్నీలో ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ సామ్ కరన్ తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో (13 వికెట్స్, 12 రన్స్) ఈ అవార్డు అందుకున్నాడు. వెస్టిండీస్-అమెరికా వేదికగా జరిగిన 2024 వరల్డ్‌కప్‌లో జస్ప్రీత్ బుమ్రా 15 వికెట్లతో అవార్డు కైవసం చేసుకున్నాడు. ఇప్పుడు అందరి దృష్టి 2026 టీ20 వరల్డ్‌కప్ (భారత్ ఉ శ్రీలంక)పై ఉంది. ఈసారి ‘ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్’ అవార్డు ఎవరి ఖాతాలోకి వెళ్లనుందో చూడాలి.

# ఐసీసీకి పోటీగా కొత్త క్రికెట్ బోర్డు..

### ఐసీసీ స్థాయి క్రికెట్ సంస్థ ఏర్పాటుకు పీసీబీ ప్రయత్నం

### 8 క్రికెట్ బోర్డులను సంప్రదించిన పీసీబీ

### పీసీబీ ప్రయత్నం ఆదిలోనే ఫెయిల్?

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మరోసారి అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో నవ్వులపాలవుతోంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి ప్రత్యామ్నాయంగా.. తమకంటూ ఒక ఐసీసీ స్థాయి క్రికెట్ సంస్థను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో పీసీబీ చేసిన ప్రయత్నం పూర్తిగా ఫెయిల్ అయినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనకు మద్దతు కోరుతూ పీసీబీ ఏకంగా 8 క్రికెట్ బోర్డులను సంప్రదించినట్లు తెలుస్తోంది. అందులో కేవలం రెండు దేశాలు మాత్రమే మద్దతు ఇవ్వడంతో పీసీబీకి భారీ షాక్ తగిలింది. కొత్త క్రికెట్ బోర్డు కోసం చైనా, బంగ్లాదేశ్, యూఏఈ, ఒమాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ స్టేట్స్, వెస్టిండీస్, జింబాబ్వే వంటి దేశాలతో పీసీబీ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఐసీసీ నిర్ణయాలపై అసంతృప్తితో ఉన్న దేశాలను ఏకం చేసి. కొత్త అంతర్జాతీయ సంస్థను ఏర్పాటు చేయాలన్నది పీసీబీ ప్లాన్‌గా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఆలోచనకు ప్రపంచ క్రికెట్ నుంచి పెద్దగా స్పందన రాలేదు. పీసీబీ సంప్రదించిన ఎనిమిది బోర్డుల్లో ఆరు బోర్డులు నో చెప్పినట్లు సమాచారం. యూఏఈ, ఒమాన్, సౌదీ అరేబియా, యుఎస్ఏ, వెస్టిండీస్, జింబాబ్వే ఈ ప్రతిపాదనను తిరస్కరించినట్లు టాక్. కేవలం చైనా, బంగ్లాదేశ్ మాత్రమే పీసీబీ ఆలోచనకు మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. ఆరు దేశాల తిరస్కరణతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చేసిన ఐసీసీ స్థాయి సంస్థ ఆలోచన మొదటి దశలోనే కుప్పకూలినట్టైంది. ఈ పరిణామంపై అటు క్రికెట్ అభిమానులు, ఇటు విశ్లేషకులు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. ఐసీసీకి పోటీగా మరో అంతర్జాతీయ సంస్థను ఏర్పాటు చేయడం అంత ఈజీనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముందు పాకిస్థాన్ క్రికెట్ తన అంతర్గత సమస్యలను పరిష్కరించుకోవాలని, ఆటపై దృష్టి పెట్టాలని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికి పీసీబీ మరోసారి అనవసర నిర్ణయాలతో క్రికెట్ ప్రపంచంలో నవ్వుల పాలయ్యిందనే అభిప్రాయం సోషల్ మీడియాలో వినిపిస్తోంది.

# 2వేల మందితో వరల్డ్ జూనియర్ రన్

**హైదరాబాద్, ఆట ప్రతినిధి :** గచ్చిబౌలి స్టేడియం వేదికగా రెండు వేల మంది పిల్లలతో అలెన్ వరల్డ్ జూనియర్ రన్ ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగింది. హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు నగరంలోని దాదాపు 180 పాఠశాలల నుంచి రెండు వేల మందికి పైగా విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. స్పాట్ ఆన్ స్పోర్ట్స్ సంస్థ నిర్వహించిన ఈ రనన్‌ను భారత యువ అథ్లెట్ అగసర నందిని జెండా ఊపి ప్రారంభించింది. గచ్చిబౌలిలో మొదలైన పరుగు టిమ్స్ గేటు నుంచి గోపీచంద్ అకాడమీ, ఐఎస్‌బీ సర్కిల్ మీదుగా తిరిగి స్టేడియంలోకి ప్రవేశించింది. 1కే రన్‌లో పిల్లలతో పాటు తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 1కే, 3కే, 5కే, 10కే విభాగాల్లో కలిపి 84 మంది ప్లేయర్లు 3 లక్షల ప్రైజ్‌మనీ సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్పాట్ ఆన్ స్పోర్ట్స్ సీఈవో రోహిత్‌మిశ్రా పాల్గొన్నారు.





# బీబీసీ స్పోర్ట్స్‌ఉమెన్ అవార్డుకు నామినేట్

### జాబితాలో హర్మన్‌ప్రీత్, స్మృతి, దివ్య పేర్లు

**ఢిల్లీ:** మీడియా దిగ్గజం బీబీసీ ప్రతియేటా అందజేసే ‘బీబీసీ ఇండియా స్పోర్ట్స్‌ఉమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు’లకు నిరుడు అంతర్జాతీయ క్రీడా యవనికపై మువ్వన్నెల కీర్తి పతాకాన్ని రెపరెపలాడించిన పలువురు క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. అవార్డుకు నామినేట్ అయినవారిలో టీమ్ఇండియా మహిళా క్రికెట్ జట్టు సారథి హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, చెస్ సంచలనం దివ్య దేశ్‌ముఖ్, షూటింగ్‌లో పతకాలు కొల్లగొడుతున్న సురుచి సింగ్, ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ పోటీలో ఉన్నారు. మరి వీరిలో అవార్డు ఎవరిని వరిస్తుందనేది త్వరలో తేలనుంది.

# భారత్‌కు స్వర్ణం..

### ఏషియన్ గేమ్స్ సెపక్‌తక్రా టెస్ట్ ఈవెంట్

**హైదరాబాద్:** ఏషియన్ గేమ్స్ 2026 టెస్ట్ ఈవెంట్‌లో భారత సెపక్‌తక్రా టీమ్ పసిడి పతకంతో మెరిసింది. జపాన్ వేదికగా జరిగిన టోర్నీలో భారత పురుషుల జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. టోర్నీలో తమ కంటే బలమైన జట్లను ఓడిస్తూ ముందుకు సాగిన భారత్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆకాశ్ యుమ్నమ్, సందీప్‌కుమార్, అరుణ్, రామ్‌కుమార్, బాబీకుమార్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.





# ఆరంభ మ్యాచ్‌లకు హాజిల్‌వుడ్ దూరం

**సిడ్నీ :** టీ20 ప్రపంచకప్ ఆరంభానికి ముందే ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. టోర్నీలో ఇప్పటికే కమిన్స్ దూరమవగా.. తాజాగా కొన్ని మ్యాచ్‌ల పాటు ఆ జట్టు ప్రీమియం పేసర్ జోష్ హాజిల్‌వుడ్ సేవలనూ కోల్పోనున్నది. కాలి మడమ నొప్పి గాయం నుంచి ఇప్పుడిప్పుడే పూర్తిస్థాయిలో కోలుకుంటున్న అతడు సిడ్నీలో పునరావాసం పొందుతున్నాడు. దీంతో అతడి స్థానంలో రిజర్వ్ పేసర్‌గా సీన్ అబాట్‌కు అవకాశం దక్కింది. పాకిస్థాన్‌తో సిరీస్‌కు దూరమైన గ్లెన్ మ్యాక్స్‌వెల్, నాథన్ ఎల్లీస్, టిమ్ డేవిడ్.. నేడు కొలంబోలో జట్టుతో కలిసే అవకాశముంది.



# అతడి ప్రవర్తన చూసి దూరం పెట్టాను

## మాజీ ప్రియుడి గురించి మృణాల్ కామెంట్స్

కొన్ని రోజులుగా ప్రేమ, పెళ్లి అంశాల్లో వరుసగా వార్తల్లో ఉంటున్నారు నటి మృణాల్ ఠాకూర్. తాజాగా ఆమె తన మాజీ ప్రేమికుడి గురించి చెప్పి మరోసారి నెట్టింట వైరల్‌గా మారారు. అతడితో బంధం ముగిసిపోయినందుకు తానేమీ బాధ పడలేదని తెలిపారు. ఆమె నటించిన తాజా చిత్రం 'దో దీవానే శహర్ మే' ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మాజీ ప్రేమికుడి గురించి ప్రస్తావించారు. నాకు దూకుడు ఎక్కువని నాతో ఉండలేనని బ్రేకప్ చెప్పాడు. నేను యాక్టింగ్ చేయడం కూడా తనకు నచ్చలేదు. విడిపోవడానికి అది కూడా ఓ కారణం. బ్రేకప్ చెప్పినందుకు నేనేం బాధపడలేదు. తన మనస్తత్వం గురించి జాలి పడ్డాను. అలాంటి వాళ్లతో కొనసాగడం కూడా కష్టమే. అందుకే విడిపోయాం. అలాంటివాళ్లతో ఉంటే భవిష్యత్తులో పిల్లలు కూడా అదే భావనలతో పెరుగుతారు. అది నాకు ఇష్టం లేదని మృణాల్ తెలిపారు.కొన్ని నెలలుగా మృణాల్ డేటింగ్ వార్తలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. నటుడు ధనుష్ తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ధనుష్ తనకు మంచి స్నేహితుడంటూ ఆ ప్రచారాన్ని మృణాల్ ఖండించారు. తర్వాత టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ తో ఆమె డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వీటిపై స్పందిస్తూ.. 'ఇలాంటి రూమర్స్ వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉంటాయి. వాళ్లు వార్తలు సృష్టిస్తుంటారు. వాటిని చూసి నేను నవ్వుకుంటాను. ఫ్రీ పీఆర్ స్టంట్స్ ఇవి' అంటూ వాటికి చెక్ పెట్టారు.

# కొత్త తారలతో మ్యాడ్-3 చిత్రీకరణ

టాలీవుడ్‌లో యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌లుగా భారీ విజయాలను అందుకున్న 'మ్యాడ్', 'మ్యాడ్ 2' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచిన విషయం తెలిసిందే. దర్శకుడు కళ్యాణ్ శంకర్ తెరకెక్కించిన ఈ రెండు చిత్రాలు యువతను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఫన్, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో సాగిన ఈ సిరీస్‌కు ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. నార్నె నవీన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్ హీరోలుగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీకి కొనసాగింపుగా 'మ్యాడ్ 3' ను తెరపైకి తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించిన నిర్మాతలు, ఈసారి కొత్త కాన్సెప్ట్‌తో పాటు కొత్త కాస్టింగ్‌ను కూడా పరిచయం చేయాలని భావిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. గత చిత్రాల్లో కనిపించిన హీరోల స్థానంలో ఈసారి కొత్త యువ నటులను తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త కాస్టింగ్‌లో భాగంగా 'లిటిల్ హార్ట్స్' ఫేమ్ జేయ్ కృష్ణ, 'కోర్ట్' ఫేమ్ హర్ష్ రోషన్ పేర్లు వినిపిస్తున్నాయి. యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ ఫ్రెష్ ఫేస్‌లతో ఈ చిత్రాన్ని రూపొందించాలన్న ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సినిమాకు 'మ్యాడ్ జూనియర్స్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఫిల్మ్‌నగర్‌లో ప్రచారం జరుగుతోంది. టైటిల్ ద్వారా కూడా ఈ చిత్రం కొత్త తరం యువత కథగా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైనట్లు సమాచారం. త్వరలోనే ఫస్ట్ లుక్, టీజర్ వంటి అప్డేట్స్ విడుదల చేసే అవకాశముంది. హాస్యం, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ లైఫ్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపొందనుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు.





# జైలర్-2లో షారూఖ్ ఖాన్






తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ క్రేజీ సీక్వెల్ జైలర్ 2. తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రానికి కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. సీక్వెల్‌లో శివరాజ్‌కుమార్, మోహన్ లాల్ పాత్రలు రిపీట్ కానున్నాయని ఇప్పటికే వార్తలు వచ్చాయి. మరోవైపు తాజాగా బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నాడని అప్‌డేట్ కూడా వచ్చింది. కాగా దీనిపై అఫీషియల్ న్యూస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. జైలర్ 2 నెక్ట్స్ షెడ్యూల్ ముంబైలో జరుగనుంది. తాజా సమాచారం ప్రకారం వచ్చే వారం షురూ కానున్న ఈ షెడ్యూల్‌లో షారుక్ ఖాన్ జాయిన్ అవ్వబోతున్నాడు. ఈ షెడ్యూల్‌లో షారుక్‌ఖాన్‌పై వచ్చే కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి నెల్సన్ దిలీప్ కుమార్ షారుక్ ఖాన్‌ను ఎలాంటి స్పెషల్ రోల్‌లో చూపించబోతున్నాడు.. తలైవా, షారుక్ ఖాన్ కాంబోలో సీన్లుంటాయా..? అన్నది తెలియాల్సి ఉంది. సిల్వర్ స్క్రీన్‌పై ఇద్దరు స్టార్ యాక్టర్లను చూసేందుకు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్, అభిమానులు. జైలర్ 2ను 2026 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని ఇప్పటికే రజినీకాంత్ క్లారిటీ కూడా ఇచ్చాడని తెలిసిందే. సీక్వెల్‌లో బాలీవుడ్ భామ విద్యాబాలన్‌తోపాటు కోలీవుడ యాక్టర్ సంతానం కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలుస్తుండగా.. మరి రాబోయే రోజుల్లో ఈ స్టార్ యాక్టర్లపై అఫీషియల్ అప్‌డేట్ ఏమైనా ఇస్తారేమో చూడాలి. జైలర్ ఫస్ట్ పార్టులో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, తమన్నా కీలక పాత్రల్లో నటించారని తెలిసిందే. సీక్వెల్‌లో ఎవరెవరుండబోతున్నారన్నదానిపై మేకర్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.



# మూవీగా వస్తోన్న మిర్జాపూర్ వెబ్ సీరిస్

యాక్షన్ క్రైం థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచిన ఫ్రాంచైజీ సిరీస్ మిర్జాపూర్. ఈ సిరీస్‌లో ఇప్పటికే మూడు సీజన్లు సందడి చేశాయి. పవర్ ఫుల్ క్యారెక్టర్లతో సాగే మూడు సీజన్లకు ప్రేక్షకుల వద్ద నుంచి అదిరిపోయే స్పందన వచ్చింది. కాగా ఈ యూనివర్స్‌ను మరింత ఎక్కువ మంది ప్రేక్షకులకు అందించేందుకు మేకర్స్ సరికొత్త ప్లాన్‌తో వస్తున్నారు. మిర్జాపూర్ ఇక ఫీచర్ ఫిల్మ్‌గా రానుంది. ఈ సినిమా కథను థియేటర్లలో అద్భుతమైన థియాట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా డిజైన్ చేశారని ఇన్‌సైడ్ టాక్. మిర్జాపూర్ ది ఫిల్మ్ అధికారికంగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉందని తెలియజేశారు. క్రైం సాగాను బిగ్ స్క్రీన్‌పై ఎలా చూపించబోతున్నారని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్. ఈ చిత్రంలో పాపులర్ యాక్టర్లు పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గుర్మీత్ సింగ్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రానికి పునీత్ కృష్ణ కథనందిస్తున్నారు. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రితేశ్ సిధ్వానీ, ఫర్హాన్ అక్తర్ నిర్మిస్తున్నారు. విడుదలకు సంబంధించిన వివరాలపై త్వరలోనే క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. గుర్మీత్‌సింగ్, ఆనంద్ అయ్యర్ సంయుక్తంగా దర్శకత్వం వహించిన మిర్జాపూర్ వెబ్ సిరీస్‌లో పంకజ్ త్రిపాఠి, శ్వేతా త్రిపాఠి, అలీ ఫజల్, హర్షిత గౌర్, విజయవర్మ తదితరులు నటించారు.






# నాని సరసన పూజా హెగ్డే..

నేచురల్ స్టార్ నాని వరుస హిట్‌లతో ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఇప్పుడు ఆయన 'సాహో' ఫేమ్ డైరెక్టర్ సుజీత్‌తో కలిసి ఒక భారీ సినిమా చేయబోతున్న సంగతి మనందరికీ తెలిసిందే. ఈ క్రేజీ కాంబో గురించి ఎప్పుడెప్పుడు అప్‌డేట్ వస్తుందా అని ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌కు ఒక అదిరిపోయే వార్త బయటకొచ్చింది. కాగా సమాచారం ప్రకారం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది జూన్ నెల నుంచి మొదలుకానుందట. ఇప్పటికే సుజీత్ అదిరిపోయే స్క్రిప్ట్‌ను రెడీ చేశారట. నానిని మనం ఇప్పటివరకు చూడని ఒక సరికొత్త స్టైలిష్ లుక్‌లో, పవర్‌ఫుల్ యాక్షన్ రోల్‌లో సుజీత్ చూపించబోతున్నారు. ఇక మరోక విషయం ఏంటి అంటే.. ఈ సినిమాలో నాని సరసన 'బుట్టబొమ్మ' పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించబోతున్నట్లు సమాచారం. నాని, పూజా హెగ్డే కలిసి నటిస్తున్న మొదటి సినిమా ఇదే కావడంతో, వీరిద్దరి జోడీ స్క్రీన్ మీద చూడటానికి చాలా ఫ్రెష్‌గా ఉండబోతోంది. అంతేకాదు ఈ మూవీ కోసం సుజీత్ చాలా టైమ్ తీసుకుని, విజువల్స్ పరంగా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా తీయాలని ప్లాన్ చేస్తున్నారట. అందుకే ఈ సినిమాను 2027 లో థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ డిసైడ్ అయ్యారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో చచ్చీుఅబూబయిత్ఫ్ర్త షూటింగ్ అప్‌డేట్ తెగ వైరల్ అవుతోంది. నాని తన నటనతో, సుజీత్ తన మేకింగ్ స్టైల్‌తో ఎలాంటి మ్యాజిక్ చేస్తారో చూడాలి!

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# మొక్క నాటిన యువ నాయకుడు



**నేటి సాక్షి, తొగుట:** తొగుట మండల కేంద్రానికి చెందిన వెంకట్రావుపేట గ్రామంలో బీఆర్ఎస్ యువ నాయకుడు పిట్ల వెంకట్ తన జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ జన్మదినం సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా కనీసం ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. యువత జన్మదిన వేడుకల పేరుతో మద్యం సేవించడం, ప్రమాదకర బైక్ రైడింగ్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా జన్మదినాన్ని అర్థవంతంగా మార్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవీందర్, నాయకులు బాలేష్ యాదవ్, పర్శరాములు, గోవర్ధన్ రెడ్డి, స్వామి గౌడ్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అల్పాహార పంపిణీ



**నేటి సాక్షి చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామాపురం లో గల 10వ తరగతి విద్యార్థులకు స్థానిక గ్రామ నివాసి, పూర్వ విద్యార్థి, ప్రభుత్వ ఉపాధ్యాయులు అయినా షేక్ రఫీ పదివేల రూపాయలు అల్పాహార కొరకు అందచేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎన్జీ శివకుమారి మాట్లాడుతూ విద్యార్థులు అల్పాహారన్ని సద్వినియోగం చేసుకోని పదవ తరగతి లో అత్యధిక మార్కులతో ఉత్తమ ఫలితాలను సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయలు టీవైఎల్ఎన్ స్వామి, ఐ రామంజలి దేవి, చందా రాములు, ఎస్ అరుంధతి, డి వెంకట్ రెడ్డి, ఎన్ పరిమళమ్మ, కె వెంకన్న, కదిర బ్రహ్మారెడ్డి మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డులో...

**కందుల కొనుగోలు కేంద్ర ప్రారంభం**

**రైతులూ...దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు**



**నేటి సాక్షి గజ్వేల్:** రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా, వాటిలోనే రైతులు పండించిన పంటలు విక్రయించాలని డిసిఓ వరలక్ష్మి స్పష్టం చేశారు. సోమవారం గజ్వేల్ మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, నిబంధనల మేరకు కొనుగోలు కేంద్రంలో విక్రయించి ఆర్థికంగా ప్రయోజనం పొందాలని సూచించారు. క్వింటాలుకు రూ 8000 చెల్లిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్టార్ రగోత్తం రెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రటరీ జాన్ వెస్లీ, ప్యాక్స్ సీఈవో బాల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# అధ్యక్షుడిగా రామారావు

**నందిగామ రేలకుంట జంట గ్రామాల నూతన కార్యవర్గం ఎన్నిక**



**నేటి సాక్షి,నల్లబెల్లి,:** నల్లబెల్లి మండలంలోని నందిగామ, రేలకుంట జంట గ్రామాల ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం పనిచేసే 'న్యూ ఆదర్శ ఆటో యూనియన్' నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఆటో డ్రైవర్ల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో యూనియన్ బలోపేతానికి, డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీని ప్రకటించారు. యూనియన్ అధ్యక్షుడిగా వోర్తాల రామారావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడు గుగులోతు శంకర్. కోశాధికారి రచ్చ నరేష్. కార్యదర్శి రాచెల్లి దిలీప్. సలహా కార్యదర్శి సిహెచ్ బస్వరాజ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రామారావు మాట్లాడుతూ. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన తోటి డ్రైవర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆటో డ్రైవర్ల మధ్య ఐక్యతను పెంపొందించడమే కాకుండా, విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను ఐక్యంగా ఎదుర్కొంటామని పేర్కొన్నారు. యూనియన్ నియమ నిబంధనలకు కట్టుబడి ఉంటూ అందరి సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు యాకయ్య, కిషన్, నాగేందర్, సురేష్, అశోక్, రాము, అనిల్, పృధ్వీ రాజు, సుమన్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యలో విద్యార్థుల దినదినాభివృద్ధి ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది




- వ్యక్తిత్వ వికాస నిపుణులు కెప్టెన్ డా. లయన్ బుర్ర మధుసూదన్ రెడ్డి

**నేటి సాక్షి, జగిత్యాల(గుండ ప్రశాంత్ గౌడ్):** విద్యార్థులు విద్యలో చూపించే దినదినాభివృద్ధి వారు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకునే దిశగా నడిపిస్తుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు, మోటివేషనల్ స్పీకర్ కెప్టెన్ డాక్టర్ లయన్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. గొల్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ గొల్లపల్లి, లీడ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చెడు అలవాట్లను త్వరగా గ్రహిస్తారని, వాటికి దూరంగా ఉండి తమ లక్ష్య సాధన కోసం ప్రతిరోజూ కష్టపడాలని సూచించారు. రోజులో 24 గంటల్లో ఎనిమిది గంటలు పాఠశాలకు, ఎనిమిది గంటలు నిద్రకు పోగా మిగిలిన ఎనిమిది గంటలను విద్య కోసం సమర్థంగా వినియోగించుకున్నవారే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. విద్యార్థులు తమలోని అలసత్వం, సోమరితనం వంటి లోపాలను గుర్తించి వాటిని జయించినప్పుడే విజయం దాసోహమవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మరో ఆరు సంవత్సరాల్లో తమ లక్ష్యాలను సాధించి సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థుల్లో పరీక్షల పట్ల భయం ఉండటం సహజమని, అయితే చదివినదాన్ని ధైర్యంగా పరీక్షల్లో రాయాలని సూచించారు. పదో తరగతి అనేది ఉన్నత చదువులకు ఒక మెట్టు మాత్రమేనని, మార్కులకే పరిమితం కాకుండా నిరంతర అభ్యాసంతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా ట్రైనింగ్ మేనేజర్ తాడూరి శ్రీనివాస్, జీఎల్‌టీ కోఆర్డినేటర్ లయన్ ఇనుగుర్తి రమేష్, లయన్ అంజనా రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుంకరి రవి, గొల్లపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు కరుణాకర్ రెడ్డి, కార్యదర్శి సాయిని నరహరి, సభ్యులు తాడూరి సత్యనారాయణ, తాడూరి శ్రీనివాస్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగులకు రూ.15 వేల పింఛన్ ఇవ్వాలి

- బీజేపీ మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్
- వికలాంగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి - డిమాండ్



**నేటి సాక్షి, పాములపాడు:** పాములపాడు మండలంలో పూర్తి అంగవైకల్యం గల వికలాంగులకు ప్రస్తుతం ఇస్తున్న పింఛన్‌ను రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచాలని బీజేపీ మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు మాధవ్ ఆదేశాల మేరకు, జిల్లా బీజేపీ అధ్యక్షులు అభిరుచి మధు సూచనలతో పాములపాడు మండల బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం "జనతా వారధి" కార్యక్రమంలో భాగంగా వికలాంగుల సమస్యలపై తహసిల్దార్‌కు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. తుమ్మలూరు గ్రామానికి చెందిన వికలాంగులు భాస్కర్ రెడ్డి, చాంద్ బాషా మాట్లాడుతూ తమకు 90 శాతం పూర్తి అంగవైకల్యం ఉందని, వికలాంగుల పింఛన్‌ను రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచాలని కోరారు. అలాగే నిత్యవసర సరుకులు ఇంటికి పంపాల్సిన రేషన్ డీలర్ సరుకులు అందజేయడం లేదని, నూతన ట్రైసైకిల్‌తో పాటు గృహం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే టిటిసి పూర్తి చేసిన చాంద్ బాషాకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల వైస్ ప్రెసిడెంట్ లింగాల గోపాలకృష్ణయ్య, చిన్న మద్దిలేటి, సంజన, రామకృష్ణ, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరతను వెంటనే తీర్చాలి



- సీపీఐ నాయకుల డిమాండ్

**నేటి సాక్షి, గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలంలో తీవ్రంగా ఉన్న యూరియా కొరతను వెంటనే పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రైతులకు సరిపడా యూరియా అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. యూరియాను ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారని, అయితే చాలా మంది రైతులకు చదువు లేకపోవడంతో ఆ ప్రక్రియ చేయలేక అవస్థలు పడుతున్నారని అన్నారు. ప్రతి గ్రామంలో యూరియా కొరత ఉందని, ఎప్పుడు సరఫరా జరుగుతుందో అని రైతులు ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఒకవైపు రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో లేకపోయినా, మరోవైపు మండలంలోని బెల్ట్ షాపుల్లో మద్యం మాత్రం విచ్చలవిడిగా లభ్యమవుతోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మండల వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, సహాయ కార్యదర్శి కూన మల్లయ్య, గ్రామ కార్యదర్శి బోయిని మల్లయ్య, గ్రామ సహాయ కార్యదర్శి బొమ్మకంటి అంజయ్య చారి, నాయకులు ఎండీ నాయీమ్, న్యాత కొమురయ్య, బూట్ల భాస్కర్, రాపోలు రాయమల్లు, కళ్లెం రవి తదితరులు పాల్గొన్నారు.

# మూఢనమ్మకాలతో సమాజం తిరోగతి



- మంత్రతంత్రాలను నమ్మొద్దు : వక్తలు

**నేటి సాక్షి న్యూస్, చౌడేపల్లి:** మూఢనమ్మకాలు సమాజాన్ని తీవ్రంగా వెనక్కి నెడుతున్నాయని, మంత్రతంత్రాలు, క్షుద్రపూజలు వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మరాదని పలువురు వక్తలు అన్నారు. చౌడేపల్లి మండలం కాగితి పంచాయతీ పరిధిలోని కాగతి ప్రాథమికోన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢనమ్మకాలు–మంత్రతంత్రాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల పాఠశాలకు చెందిన ఓ బాలుడి మృతి నేపథ్యంలో విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరవడంతో, ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దెయ్యాలు, మంత్రాలు, తంత్రాలు వంటి మూఢవిశ్వాసాలను నమ్మకుండా ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. విద్య ఒక్కటే జీవన ప్రమాణాన్ని మెరుగుపరచే మార్గమని, మూఢనమ్మకాల కారణంగా విద్యార్థులు చదువుకు దూరం కావద్దని అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల్లో ధైర్యాన్ని నింపాలని, భయాలు కలిగించే మూఢవిశ్వాసాలకు ఆస్కారం ఇవ్వకూడదని సూచించారు. మ్యాజిక్ ప్రదర్శనల ద్వారా మూఢనమ్మకాల వెనుక ఉన్న అవాస్తవాలను విద్యార్థులు, తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం విద్యకు ప్రాధాన్యం ఇచ్చి ప్రతిరోజూ పాఠశాలకు రావాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు హరినాథ్, శర్మ, యుగంధర్, గిరిధర్ మూర్తి, ఎస్కే యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటరెడ్డి, ఎంపీడీవో లీలా మాధవి, ఎస్సై నాగేశ్వరరావు, ప్రకృతి వనం ప్రసాద్, ఎంఈఓ కేశవరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి సాక్షి TGTEL/25/A1737 | NETI SAKSHI

కరీంనగర్ | మంగళవారం 03 ఫిబ్రవరి 2026

# అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా నక్క సతీష్



**నేటి సాక్షి, జగిత్యాల । (పూరెళ్ల బాపు):** జగిత్యాల రూరల్ మండల పరిధిలోని జాబితాపూర్ గ్రామంలో సోమవారం అంబేద్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఘనంగా ఎన్నుకున్నారు. సంఘ సభ్యులందరి ఏకాభిప్రాయంతో నక్క సతీష్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ యువత సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో ఇతర పదవులను కూడా ఏకగ్రీవంగా ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా నక్క వినోద్, ప్రధాన కార్యదర్శిగా ఈదుల గంగారాం, సహాయ కార్యదర్శిగా నీలం చంద్రశేఖర్, కోశాధికారిగా దొనకొండ అశోక్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బొమ్మేన వంశీ ఎన్నికయ్యారు. అదనంగా మరో 20 మంది కార్యవర్గ సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నక్క సతీష్ మాట్లాడుతూ, బాబాసాహెబ్ డా.బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకు, గ్రామ యువత ఐక్యతను బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఈదుల రాములు, నలవాల గంగారాం, నలవాల రాజన్న, గంగాధర మురళి, బేక్కం లక్ష్మణ్, నీల లక్ష్మణ్, నీలం నర్సయ్య, కొత్తూరు తిరుపతి, కొత్తూరు గంగాధర్, నీలం గంగపోసం తదితరులు పాల్గొన్నారు.

# ప్రచార వాహనాల అనుమతికి స్పష్టమైన మార్గదర్శకాలు




**నేటి సాక్షి, కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వాహనాల వినియోగానికి ముందుగా సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతి పొందాల్సి ఉంటుందని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. ప్రచార వాహనాల ద్వారా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు తావు లేకుండా, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణకు భంగం కలగకుండా ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

## డాక్యుమెంట్లు తప్పనిస

ప్రచార వాహనానికి అనుమతి పొందాలంటే వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్‌సీ), ఫిట్నెస్ సర్టిఫికేట్, చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ పాలసీ తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అదేవిధంగా వాహనం నడిపే డ్రైవర్‌కు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, ప్రచార సమయంలో లౌడ్ స్పీకర్ వినియోగించాలంటే సంబంధిత డీఎస్పీ కార్యాలయం నుంచి ముందస్తు ఎన్‌ఓసీ తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యర్థి పూర్తి వివరాలు, పార్టీ వివరాలు కూడా అప్లికేషన్‌కు జత చేయాల్సి ఉంటుందని తెలిపారు.

## టిపిఓ కార్యాలయంలో అప్లికేషన్




పై అన్ని డాక్యుమెంట్లను సమగ్రంగా సేకరించిన అనంతరం, ప్రచార వాహనాన్ని వినియోగించనున్న అభ్యర్థి వివరాలు, పార్టీకి సంబంధించిన సమాచారంతో కలిసి కోరుట్ల మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టూపా) కార్యాలయంలో అప్లికేషన్ దాఖలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అప్లికేషన్‌ను పరిశీలించిన అనంతరం ఎన్నికల నిబంధనల మేరకు ప్రచార వాహన వినియోగానికి అధికారిక అనుమతి మంజూరు చేయబడుతుందని తెలిపారు. అనుమతి లేకుండా వాహనాలను ఉపయోగించిన పక్షంలో ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం

- **జేనవరి నెలలో 22 కేసులు నమోదు**
- **వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా**



**నేటి సాక్షి, వికారాబాద్:** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అక్రమ రవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా ఆదేశాలు జారీ చేశారు. ఆమె ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించగా, కేవలం జనవరి నెలలోనే జిల్లా వ్యాప్తంగా మొత్తం 22 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. సహజ వనరుల దోపిడీని అరికట్టే క్రమంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై 14 కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌పై ఒక కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పర్యావరణానికి, ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న నిషేధిత చైనా మాంజా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నాలుగు కేసులు నమోదు చేసినట్లు వివరించారు. అక్రమ రవాణాతో పాటు సామాజిక రుగ్మతలపై కూడా టాస్క్ ఫోర్స్ బృందాలు గట్టి నిఘా కొనసాగించాయి. ఇందులో భాగంగా పేకాట స్థావరాలపై దాడులు చేసి ఒక కేసు, మాదకద్రవ్యాల నిరోధక చట్టం (ఎన్‌డీపీఎస్) కింద ఒక కేసు, అలాగే ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ ఆహార పదార్థాల విక్రయదారులపై మరో కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని హెచ్చరించిన ఎస్పీ, జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

# అభివృద్ధి పనులపై సర్పంచులకు అవగాహన యాత్ర





- **మరికల్ ఎంపీడీవో ఆధ్వర్యంలో కార్యక్రమం**

**నేటి సాక్షి నారాయణపేట ఇమామ్ సాబ్:** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండలంలో వివిధ గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మరికల్ మండల ఎంపీడీవో పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ అవగాహన యాత్రలో భాగంగా చిత్తనూరు, జిన్నారం తదితర గ్రామాల్లో గతంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను సర్పంచులకు వివరించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు, పూడికతీత, డ్రైనేజీ వ్యవస్థలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి అంశాలపై సర్పంచులకు స్పష్టత కల్పించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి సర్పంచులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఎంపీడీవో సూచించారు. ఈ అవగాహన యాత్రలో మరికల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఉపసర్పంచులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా దేశస్తుల ప్రత్యేక పూజలు



**నేటి సాక్షి, శంకర్‌పల్లి :** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో వెలసిన 11వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో సోమవారం అమెరికా దేశస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారతీయ సంప్రదాయ వస్త్రాలు ధరించిన వారు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక ఆరాధనలు చేశారు. ఆలయ ఆవరణలోని ఉసిరి చెట్టు వద్ద ఒత్తుల దీపాలు వెలిగించి భక్తితో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు దాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, అన్నదాన కమిటీ చైర్మన్ దర్శన్ గౌడ్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

## తండ్రి-కొడుకు మృతి



**నేటి సాక్షి వికారాబాద్:** వికారాబాద్ పట్టణ పరిధిలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయం మలుపు వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో కొండాపూర్ కలాన్ గ్రామానికి చెందిన చకాలి లలయ్య (35) మరియు అతని కుమారుడు చకాలి రిథిక్ (6) మృతి చెందారు. వివరాల ప్రకారం, చకాలి లలయ్య తన కుమారుడు రిథిక్ తో మోటార్ సైకిల్ (TS 34 6577) పై వికారాబాద్ వైపు వెళ్తుండగా, వారి వెనుక చకాలి లలయ్య భార్య మేఘన తన కుమార్తె రిషిక (7) తో స్కూటీ (టూ 34 జీ 5735) పై ప్రయాణించుతున్నారు. ఈ సమయంలో వికారాబాద్ నుండి తాండూర్ వైపు వెళ్తున్న క్రేన్ లోడ్‌తో లారీ (HRY 0333) అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ, లలయ్య మోటార్ సైకిల్‌ను ఢీకొట్టి, అనంతరం స్కూటీని కూడా ఢీకొట్టింది. ఢీకొట్టిన లారీ నియంత్రణ కోల్పోగా, లారీ మరియు క్రేన్ కింద పడింది. ఫలితంగా చకాలి లలయ్య మరియు అతని కుమారుడు రిథిక్ పై పడిన లారీ ద్వారా మరణించారనది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వికారాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రఘుకుమార్ తెలిపారు, లారీ డ్రైవర్ ఎమ్.డి. షకీర్ (36, హర్యానా) మద్యం సేవించి వాహనం నడిపినట్లు ప్రాథమికంగా తేలింది. కేసు నమోదు చేసి, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# కార్మికురాలికి పరామర్శ

**నేటి సాక్షి-మేడిపల్లి:** మేడిపల్లి మండల కేంద్రంలో గత 20 సంవత్సరాలుగా గ్రామపంచాయతీ కార్మికురాలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న మంత్రి రాజమ్మ ఇటీవల అనారోగ్యం బారినపడి జగిత్యాల హాస్పిటల్ లో సర్జరీ చేయించుకుని డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చిన విషయం తెలుసుకుని రాజమ్మ ని పరామర్శించిన గ్రామ సర్పంచ్ మకిలి దాస్, ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఉప సర్పంచ్ తోపారపు అర్జున్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు దేశవేని కృష్ణ, గ్రామపంచాయతీ కార్యదర్శి వావిలాల అజయ్ రాజు, పాల్గొన్నారు.



# బీసీ కాలనీలో ఉద్రిక్తత



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** బాబు జగజీవన్ రామ్ స్థలంలో దేవుడి విగ్రహాన్ని పెట్టారని ఎమ్మార్పీఎస్ ఎండిపిఎస్, నాయకులు రెవెన్యూ పోలీసు లకు వినతిపత్రం అందిస్తూ నిరసన వ్యక్తం చేశారు తమ స్థలం ఇప్పించాలని వారు ఇరు అధికారులను కోరారు. అయితే అది ప్రభుత్వ స్థలమని తాము వినాయకుడి దేవాలయం నిర్మించాలని విగ్రహం పెట్టామని కాలనీవాసులు అనడంతో అక్కడ తీవ్ర ఉద్క పరిస్థితి ఏర్పడింది. వెంటనే తహసిల్దార్ పార్వతి పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్ ఎస్సై నాగేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలకు అర్థం అయ్యేలా చెప్పి పరిస్థితి సర్దుమనిశారు. అయితే ఇప్పటికే ఆ స్థలంలో ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేశామని ఎవరు అతిక్రమించరాదని రెవెన్యూ అధికారులు అంటున్నారు ఎవరు ఎలాంటి చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని సీఐ సాయి ప్రసాద్ హెచ్చరించారు. అనంతరం పరిస్థితి సద్దుమణిగింది.

# కుటుంబానికి ఆర్థిక సాయం



**నేటి సాక్షి తిరుమలాయపాలెం (రుద్రరాజు మెట్టు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని జూపెడ గ్రామంలో ఇటీవల మరణించిన దోనెపల్లి వెంకన్న కుటుంబానికి గ్రామ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పాలకమండలి సభ్యులు, దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించారు. గ్రామస్థుల సహకారంతో వెంకన్న కుటుంబానికి రూ.66,000 నగదు మరియు 25 కిలోల బియ్యం సంచి అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో జూపెడ గ్రామ సర్పంచ్, వైస్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీటీసీతో పాటు వార్డు సభ్యులు ఇందుర్తి మల్లారెడ్డి, తిప్పారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మందడి నరేందర్, బొల్లికొండ నరేష్, తిప్పారెడ్డి మల్లారెడ్డి, విష్ణు, సైదులు, డి. వీరన్న తదితరులు పాల్గొన్నారు. ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ వెంకన్న కుటుంబ సభ్యులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు

# చట్టాన్ని పునరుద్ధరించాలి: సీపీఎం



**నేటి సాక్షి, పాములపాడు:** గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు, పేద రైతులు, ఇతర వృత్తిదారులకు పని కల్పించి వలసలను తగ్గించాలంటే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని సీపీఎం మండల కార్యదర్శి డి. స్వామన్న డిమాండ్ చేశారు. సోమవారం పాములపాడు మండలంలోని చెలిమిళ్ళ, ఇస్కాల, ఎర్రగూడూరు, పాములపాడు గ్రామ కార్యదర్శులకు సీపీఎం నాయకులు వినతిపత్రాలు అందజేశారు. వామపక్ష పార్టీల కృషితో అమలులోకి వచ్చిన ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ నిధులు తగ్గిస్తోందని ఆరోపించారు. కొత్తగా తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ పేరుతో ఉన్న ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు ఎస్. బాలయ్య, వీ. రామకృష్ణ, బి. రమణమ్మ, ఎం. బాలయేసు, ఎస్.ఆర్. వెంకటరమణ, ఆనంద్ గౌడ్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర గల భీమన్న ఆలయం

## పలు జిల్లాల నుంచి తరలివచ్చే భక్తులు



**నేటి సాక్షి, రాయికల్ (ఇమ్మడి విజయ్ కుమార్):** రాయికల్ పట్టణంలో నూరేళ్లకు పైగా చరిత్ర కలిగిన భీమన్న ఆలయంలో ప్రతి సంవత్సరం రెండో నెల పౌర్ణమి నుంచి మూడు రోజుల పాటు జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ ఆలయాన్ని భీమక్క వంశస్థులే తరతరాలుగా నిర్వహిస్తూ వస్తున్నారు. భీమక్క పోరండ్ల గ్రామానికి చెందిన భీమన్న దేవుని ప్రతిమలను రాయికల్‌లో ప్రతిష్ఠించినప్పటి నుంచి జాతర నిర్వహణ ఆనవాయితీగా కొనసాగుతోంది. ప్రస్తుతం మూడో తరం వారసులు దేవుని లింగయ్య, రాజం తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. జాతర సందర్భంగా నిర్మల్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు పరిసర గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. చివరి రోజు జరిగే రథోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ, లక్షలాది మంది భక్తులు స్వామివారి రథాన్ని లాగి తమ భక్తిని చాటుకుంటారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు గొప్ప వరం



**నేటి సాక్షి, పగిడ్యాల:** నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.4,96,941 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గిత్త జయసూర్య పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి టీడీపీ నాయకులతో కలిసి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న బాధితులకు కూటమి ప్రభుత్వం తరఫున తక్షణ సాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు నందికొట్కూరు నియోజకవర్గంలో 340 మందికి రూ.2,64,47,859 మేర ఆర్థిక సహాయాన్ని అందించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా నిరంతరం అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు లోకానందరెడ్డి, మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, మాదిరెడ్డి రామ్ రెడ్డి, పుల్యాల రాజశేఖర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, వెంకటేశ్వర్లు, అశ్విన్, వెంకటస్వామి గౌడ్, రమణ గౌడ్, ప్రభాకర్, గంగన్న, దామోదర్ రెడ్డి, పుల్యాల వాసురెడ్డి, మచ్చ శ్రీనివాసులు, వగిలి శ్రీనివాసులు, సగినేల రమణ (నంద్యాలజిల్లా కార్యదర్శి), కే. పెద్ద ఎల్లయ్య, మూర్తి జావలి, రాముడు, తెలుగు వెంకటేశ్వర్లు, ఎర్ర వెంకటరెడ్డి, మద్దిలేటి గౌడ్, కొట్టం శంకర్ (జేసీబీ శంకర్) తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కోరుట్ల కాంగ్రెస్‌లో 20వ వార్డు టికెట్‌పై ఉత్కంఠ



- కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జిని కలిసిన వార్డు ప్రజలు గంధం గంగాధర్‌కు మద్దతుగా ఏకగ్రీవ విజ్ఞప్తి
- 'టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలిపిస్తాం' అని హామీ

**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 20వ వార్డు కౌన్సిలర్ టికెట్‌కు సంబంధించి కొనసాగుతున్న అనిశ్చితి నేపథ్యంలో, వార్డు ప్రజలు నేరుగా రంగంలోకి దిగారు.. సోమవారం 20వ వార్డుకు చెందిన ప్రజలు కాంగ్రెస్ నియోజకవర్గ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావును మర్యాదపూర్వకంగా కలిశారు. నామినేషన్ దాఖలు చేసిన గంధం గంగాధర్‌కే పార్టీ టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. టికెట్ విషయంలో స్పష్టత లేకపోవడంతో పార్టీ శ్రేణులు, ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతున్న వేళ ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

### కుల పెద్దలు, మహిళలు, యువతతో బలమైన మద్దతు

ఈ సమావేశంలో వార్డు కుల పెద్దలు, సుమారు 50 మంది మహిళలు, 70 మంది యువకులు పాల్గొని గంధం గంగాధర్ గతంలో వార్డు అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. రోడ్లు, మౌలిక సదుపాయాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవను గుర్తు చేస్తూ, ప్రజల్లో ఆయనకు బలమైన ఆదరణ ఉందని తెలిపారు. పార్టీ టికెట్ గంధం గంగాధర్‌కు ఇస్తే, అధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ఇన్చార్జి ఎదుట స్పష్టంగా హామీ ఇచ్చారు.

### టికెట్ గందరగోళం పార్టీకే నష్టమన్న అభిప్రాయం

నామినేషన్ వేసిన అభ్యర్థికి కాకుండా వేరే అభ్యర్థికి బీ-ఫాం ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం పార్టీకి నష్టం కలిగిస్తుందన్న అభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తమైంది. క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతు ఉన్న అభ్యర్థిని పక్కన పెట్టడం వల్ల కార్యకర్తల్లో నిరుత్సాహం పెరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ అంశాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి తక్షణమే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని స్పష్టత ఇవ్వకపోతే, కోరుట్ల 20వ వార్డులో రాజకీయ పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# భూమిపూజ, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**నేటి సాక్షి, మిడ్తూరు:** మిడ్తూరు మండలంలోని చింతలపల్లి, ఖాజీపేట గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు, అలాగే చింతలపల్లి గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఆరోగ్య కేంద్రానికి భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు. అనంతరం చింతలపల్లి గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే ఖాజీపేట గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మినిగ కృష్ణుడుకు మంజూరైన రూ.42,195 విలువైన చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మౌలిక వసతుల కల్పనతో పాటు రైతులకు అవసరమైన సేవలను మరింత చేరువ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రమేష్ రెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ రమణమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాద్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, కేదార్ రెడ్డి, ఆది కుమార్ నాయుడు, మనోహర్ రెడ్డి, సర్వోత్తం రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, గోకారి, షబ్బు, నరసింహ గౌడ్, నాగేంద్ర, రాంభూపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శేషి రెడ్డి, స్వామి రెడ్డి, అయ్యన్న, రవికాంత్ రెడ్డి తదితర గ్రామ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా బుగ్గారం పోచమ్మల జాతర-రథోత్సవం



**నేటి సాక్షి, బుగ్గారం:** బుగ్గారం మండల కేంద్రంలో సోమవారం శ్రీ ముత్యాల పోచమ్మ - నల్ల పోచమ్మల జాతర, రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తండోప తండాలుగా భక్తులు వివిధ జిల్లాల నుండి, అంతర్ రాష్ట్రాల నుండి తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకుని వారి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మసర్తి నర్సయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతరలో భక్తులకు అన్నదానం, దావతోళ్ల విన్యాసాలు, ఒగ్గు కళాకారుల నృత్యాలు, డప్పు కళాకారుల ప్రదర్శనలు నిర్వహించి భక్తులను ఆకట్టుకున్నాయి. చైర్మన్ మసర్తి నర్సయ్య తనయుడు నరేష్ ప్రత్యేకంగా వండిన బోనాలను అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించారు. రథానికి ప్రకృతి పూలు, రంగు పిండితో ముగ్గులు, అన్నంతో ఏర్పాటు చేసిన దిష్టికుంభం అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తుల భద్రత కోసం బుగ్గారం ఎస్సై జి. సతీష్ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ బలగాలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. భక్తుల వాహనాలను ప్రత్యేక స్థలాల్లో పార్క్ చేసి ట్రాఫిక్ నియంత్రణ జాగ్రత్తలు తీసుకున్నారు. హమాలి సంఘం, ఆలయ కమిటీ సభ్యులు, కార్యవర్గం ప్రత్యేక కృషితో ఉచిత సేవలు అందజేసి రుచి-శుభ్రమైన వంటకాలు, కూరగాయలతో అన్నదానం నిర్వాహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్క రాజవ్వ - రాజయ్య, ఉప సర్పంచ్ జంగ లావణ్య - శ్రీనివాస్, వర్గ వార్డ్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలు, తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, కాంగ్రెస్, టిడిపి, డీఎస్పీ మండల అధ్యక్షులు వేముల సుభాష్, పెద్దనవేని రాగన్న, దూడ పోచ రాజయ్య, మాజీ సర్పంచ్‌లు మసర్తి రాజారెడ్డి, లక్ష్మి, మూల సుమలత - శ్రీనివాస్, నాయకులు శంకర్, రాజన్న, సత్తన్న, మల్లయ్య, మల్లేశం, పోచమల్లు, వేలాది భక్తులు పాల్గొన్నారు. భక్తులు, ముఖ్యంగా మహిళలు స్వయంగా రథాన్ని లాగి భక్తిని చాటుకున్నారు.

# న్యాయ పరిశోధనలో మెట్‌పల్లికి గర్వకారణం

- సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల్లో ప్రస్తావన పొందిన సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వరరావు
- ఘనంగా సన్మానించిన మెట్ పల్లి పోలీస్ అధికారులు




**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** న్యాయశాస్త్ర రంగంలో పరిశోధనలకు కొత్త దిశ చూపుతూ, దేశ అత్యున్నత న్యాయస్థానాల తీర్పుల్లో తన పరిశోధనా వ్యాసం ప్రస్తావన పొందిన మెట్ పల్లి సీనియర్ సివిల్ జడ్జి శ్రీ డి. నాగేశ్వరరావు పట్టణానికి గర్వకారణంగా నిలిచారు. ఈ అరుదైన గౌరవం లభించిన సందర్భంగా మెట్ పల్లి సబ్ డివిజన్ పోలీస్ అధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు.

### పరిశోధన నుంచి తీర్పుల వరకూ..

డి. నాగేశ్వరరావు రచించిన "ఐఅటటవతీవత్ ూాం-జూవష్ఠ్ం శీట వావష్ఱశీఅ 173(8) శీట్ ష్ట్రవ జతీూజ" అనే పరిశోధనా వ్యాసం న్యాయవర్గాల్లో విశేష గుర్తింపు పొందింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 173(8)కు సంబంధించిన వివిధ కోణాలను విశ్లేషిస్తూ రాసిన ఈ వ్యాసం, న్యాయస్థానాల తీర్పులకు మార్గదర్శకంగా నిలవడం విశేషంగా భావిస్తున్నారు.

### సుప్రీంకోర్టు తీర్పులో ప్రస్తావన

భారత సర్వోన్నత న్యాయస్థానం "తమిళనాడు రాష్ట్రం వర్సెస్ హేమేంద్ర రెడ్డి" (2023) కేసును విచారించిన సందర్భంలో, సెక్షన్ 173(8) పరిధి, దర్యాప్తు పునఃప్రారంభ అంశాలపై వివరణ ఇచ్చేటప్పుడు నాగేశ్వరరావు పరిశోధనా వ్యాసాన్ని ప్రామాణికంగా ప్రస్తావించింది. ఇది ఒక జిల్లా స్థాయి న్యాయాధికారి చేసిన పరిశోధనకు లభించిన అత్యున్నత గుర్తింపుగా న్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి.

### హైకోర్టు తీర్పులోనూ గుర్తింపు

అలహాబాద్ హైకోర్టు కూడా "అజయ్ సింగ్ వర్సెస్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం" (2024) కేసులో ఈ పరిశోధనా వ్యాసాన్ని ఉటంకించింది. దర్యాప్తు సంస్థల అధికారాలు, చట్టపరమైన పరిమితులపై స్పష్టతనిచ్చే క్రమంలో ఈ వ్యాసాన్ని ఆధారంగా తీసుకోవడం ద్వారా, నాగేశ్వరరావు మేధోమథనానికి మరింత ప్రాధాన్యం చేకూరింది.

### పోలీస్ అధికారుల ఘన సన్మానం

ఈ సందర్భంగా మెట్ పల్లి సీఐ వి. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పోలీస్ అధికారులు జడ్జి నాగేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూల బొకే అందించి, శాలువాతో ఘనంగా సన్మానిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. న్యాయ పరిశోధనలు కేవలం అకడమిక్ స్థాయిలోనే కాకుండా, న్యాయస్థానాల తీర్పులకు దిశానిర్దేశం చేసే ప్రెసిడెంట్స్‌గా మారడం సమాజానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు.

### న్యాయ వర్గాల్లో హర్షం

ఒక నిబద్ధత కలిగిన న్యాయాధికారి చేసిన పరిశోధన దేశవ్యాప్తంగా న్యాయవ్యవస్థకు ఉపయోగపడటం పట్ల మెట్ పల్లి డివిజన్ ప్రజలు, న్యాయవాద వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మేయర్,చైర్మన్ ఎంపిక ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



**నేటి సాక్షి మంచిర్యాల జిల్లా:** 2వ సాధారణ మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా మేయర్ చైర్మన్ ఎంపిక ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణి కుముదిని అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవి, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్ల లతో మున్సిపల్ ఎన్నికలలో భాగంగా మేయర్ చైర్మన్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపాలిటీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో నామినేషన్లు స్వీకరించడం జరిగిందని, అభ్యంతరాలు, ఉపసంహరణల అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను తయారు చేయడం జరుగుతుందని, వెంటనే గుర్తుల కేటాయింపు చేసి బ్యాలెట్ పేపర్లను ముద్రణకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. 11వ తేదీన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని,12 రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13 వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మేయర్లు చైర్మన్ల ఎంపిక ప్రక్రియలో ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ఇందులో భాగంగా ఎంపిక చేయబడిన అధికారులకు ఆన్లైన్ ద్వారా కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు 4 మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణ అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడుతున్నామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం మేయర్ చైర్మన్ ఎంపిక ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపడతామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు జశ్వంత్, రాజేంద్రప్రసాద్, మహేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు,

# ఉత్సాహంగా సీఎం కప్ క్రీడలు




**నేటిసాక్షి. కొడిమ్యాల:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం సీఎం కప్ 2025-26 మండల స్థాయి క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఇ. స్వరూప స్థానిక కొడిమ్యాల సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఈ స్వరూప. సర్పంచ్ జీవన్ రెడ్డి, ఎఎంసి మల్యాల వైస్ చైర్మన్ కొండూరు రాజేష్ , ఉపసర్పంచ్ గుర్రం నరసయ్య గౌడ్, వార్డు మెంబర్లు శ్రీజ, శ్రీనివాస్, మండల విద్యాధికారి ఐత శ్రీనివాస్, మండల ఎస్‌జిఎఫ్ కార్యదర్శి బూట్ల రాజామల్లయ్య, ప్రధానోపాధ్యాయురాలు ఆచి విజయేంద్ర ,ఫిజికల్ డైరెక్టర్లు బీరయ్య ,శివకృష్ణ, అనూప్ రెడ్డి, మల్లయ్య, హబీబ్, ప్రదీప్ పాల్గొన్నారు. వాలీబాల్: 18 ఏళ్ల లోపు బాలబాలికలకు. కో-కో: 14 నుండి 20 ఏళ్ల లోపు బాలబాలికలకు. కబడ్డీ: పురుషులు. మహిళలకు.అథ్లెటిక్స్: వివిధ విభాగాల్లో పరుగు పందాలలో. హిమాత్రావు పేట. నాచుపెల్లి. పూడూర్. రామకృష్ణాపూర్. కొడిమ్యాల. సూరంపేట. చెప్యాలా. తిరుమలాపూర్. నమిలకొండ. క్లస్టర్ల నుండి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఒక్క రాత్రి నర్సరీ

### హస్నాబాద్‌లో హరితహారం అద్భుతం..!

### వార్తలు వచ్చిన వెంటనే ఒక్క రాత్రిలో ప్రత్యక్షమైన నర్సరీ

### మొన్న ఖాళీ నర్సరీ.. నిన్న మొక్కల హడావుడి




**నేటి సాక్షి, తిరుమలాయపాలెం (రుద్రరాజు మెట్టు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్ గ్రామపంచాయతీలో హరితహారం పథకం చుట్టూ ఏర్పడిన వివాదం ఒక్క రాత్రిలోనే కొత్త మలుపు తిరిగింది. నిన్నటి వరకు మొక్కల జాడలేని నర్సరీ, సోమవారం తెల్లవారేసరికి మొక్కలతో నిండిపోవడం స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీసింది. 2024-2025 ఆడిట్ లెక్కల ప్రకారం హరితహారం కింద సుమారు రూ.16 లక్షలు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో నమోదు కాగా, 6 వేల మొక్కలు ఉత్పత్తి చేసినట్లు అధికారిక లెక్కలు చూపుతున్నాయి. అయితే నిన్నటి వరకు నర్సరీ పూర్తిగా ఖాళీగా ఉండటం, మొక్కల సంరక్షణకు సంబంధించిన ఎటువంటి ఆధారాలు కనిపించకపోవడం తీవ్ర విమర్శలకు కారణమయ్యాయి. ఈ వ్యవహారంపై వార్త కథనాలు వెలువడిన వెంటనే ఒక్క రాత్రిలో నర్సరీ ప్రత్యక్షమవడం సహజమా? అనే ప్రశ్నలు గ్రామంలో గట్టిగా వినిపిస్తున్నాయి. కాగితాల్లో చూపిస్తున్న 6 వేల మొక్కలు నిజంగా నాటినవేనా? లేక బిల్లుల్లో మాత్రమే ఉన్నాయా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. హరితహారం పేరుతో ప్రజాధనాల దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలపై స్వతంత్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. 2024-2025 హరితహారం ఖర్చులపై పూర్తిస్థాయి ఆడిట్, 6 వేల మొక్కలపై ఫిజికల్ వెరిఫికేషన్, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఇలాంటి "ఒక్క రాత్రి నర్సరీలు" మరెన్నో కనిపించే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**నేటి సాక్షి, గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భోజనంలో వడ్డించిన అన్నం, పాలకూర పప్పు, వంకాయ-ఆలుగడ్డ-టమాటా కూరలను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు భోజనం నెయ్యితో వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, సరుకులు అందిన వెంటనే నమోదు చేయాలని, ఒకేసారి రాస్తానని నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థుల హాజరు మేరకు అందరికీ సరిపడా రుచికరమైన ఆహారం వండాలని సూచించారు. పిల్లలు కూర్చున్న చోటికే వెళ్లి మరల అన్నం, కూరలు వడ్డించాలని వంట సిబ్బందికి స్పష్టం చేశారు. విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడిన కలెక్టర్, ఆహారం బాగా నమిలి తినాలని, తినేటప్పుడు మాట్లాడకూడదని, ఒక్క మెతుకు కూడా వృథా చేయకూడదని సూచించారు. సరిపడా ఆహారం తీసుకుంటేనే శారీరకంగా దృఢంగా ఉంటారని, చదువుతో పాటు ఆటలు కూడా తప్పనిసరిగా ఆడాలని తెలిపారు. పిల్లల భోజనం, వసతి, విద్య విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, క్రమశిక్షణతో పాటు మంచి విలువలు అలవర్చాలని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పిల్లల భద్రతే ఆపరేషన్ స్మైల్

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**నేటి సాక్షి మంచిర్యాల జిల్లా,** బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రతి సంవత్సరం రెండు సార్లు ఆపరేషన్ స్మైల్ మరియు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఐపీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా తప్పిపోయిన, వదిలివేయబడిన, అలాగే కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లు, వివిధ కంపెనీలు మరియు రోడ్లపై భిక్షాటన చేస్తున్న బాలలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించడం లేదా అవసరమైతే చిల్డ్రన్ హోమ్‌లకు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆపరేషన్ స్మైల్ - XII కార్యక్రమాన్ని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బంది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్ తదితర ప్రభుత్వ శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించినట్లు సీపీ ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని ప్రతి డివిజన్‌కు ఒక ఎస్.ఐ మరియు నలుగురు సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సంవత్సరం జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్-XIIలో మొత్తం 166 మంది బాల బాలికలను గుర్తించినట్లు తెలిపారు.

### పెద్దపల్లి జిల్లా పరిధిలో

బాలురు-30, బాలికలు-18, మొత్తం - 48 మందిని గుర్తించి, 5 కేసులు నమోదు చేసి, 5 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

### మంచిర్యాల జిల్లా పరిధిలో

బాలురు-93, బాలికలు-25, మొత్తం-118 మందిని గుర్తించి, 15 కేసులు నమోదు చేసి, 15 మందిని అరెస్ట్ చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజం మొత్తంగా బాధ్యతాయుతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు, బాల కార్మికులుగా ఉపయోగిస్తున్నట్లు, లేదా తప్పిపోయిన, వదిలివేయబడిన బాలల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. బాల కార్మికులను నియమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పోలీస్ శాఖతో కలిసి కృషి చేసిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

# ప్రైవేట్ హాస్పిటల్స్‌పై కఠిన చర్యలు

- క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్-2010 ఉల్లంఘనలపై జిల్లా యంత్రాంగం సీరియస్
- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరిక



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య )** జగిత్యాల జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, నర్సింగ్ హోమ్‌లు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్-2010 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా అధికారులు స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. ఈ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ లేకుండా లేదా రిజిస్ట్రేషన్ నిబంధనలను ఉల్లంఘిస్తూ నడిపే ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకునేందుకు జిల్లా పరిపాలన సిద్ధంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఛాంబర్‌లో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన డాక్టర్లు మరియు పారామెడికల్ సిబ్బంది పేర్లతో మాత్రమే వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఏ డాక్టర్ లేదా సిబ్బంది వెళ్లిపోయినా లేదా కొత్తగా జాయిన్ అయినా వెంటనే ఆ వివరాలను రిజిస్ట్రేషన్‌లో అప్‌డేట్ చేయించుకోవాలని, లేకపోతే చట్టపరమైన చర్యలకు దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ చట్టంలోని ప్రతి నిబంధనను అన్ని ఆసుపత్రులు కచ్చితంగా పాటించాలని ఆయన ఆదేశించారు.

### నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత మాట్లాడుతూ.. నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రులపై జరిమానాలు, లైసెన్స్ రద్దు, చట్టపరమైన చర్యలతో సహా తీవ్రమైన శిక్షాత్మక చర్యలు తీసుకునేందుకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ నియంత్రణలను సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రోగ్రాం ఆఫీసర్లకు డివిజన్ల వారీగా ఆసుపత్రులను కేటాయించి, నిరంతర తనిఖీలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు. ఈ తనిఖీల ద్వారా రిజిస్ట్రేషన్ స్థితి, సిబ్బంది వివరాలు, సౌకర్యాల నాణ్యత, చట్టపరమైన అనుమతులు అన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించనున్నారు. ఈ సమావేశంలో డిఎస్పీ స్పెషల్ బ్రాంచ్ వెంకటరమణ, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ పర్యవేక్షకులు కుతుబుద్దీన్, హెల్త్ ఎడ్యుకేటర్ తరాల శంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, క్లినిక్‌లు తమ రిజిస్ట్రేషన్ స్థితిని వెంటనే తనిఖీ చేసుకొని, అవసరమైన అప్‌డేట్‌లు, సరిదిద్దులు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ చర్యల ద్వారా జిల్లాలో నాణ్యమైన, సురక్షితమైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూసేందుకు జిల్లా పరిపాలన నిబద్ధతతో ఉందని స్పష్టమవుతోంది.

# వైస్ చైర్మన్ ఎంపికకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



- పారదర్శకంగా, నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించా
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య ):** మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికలో ఎక్స్ ఆఫీషియో సభ్యుల ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జగిత్యాల కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ పాల్గొన్నారు.

### చిన్నపాటి లోపాలకు కూడా తావు లేకుండా చర్యలు

ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ౹ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, ఎక్కడ చిన్నపాటి లోపాలకు కూడా అవకాశం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పూర్తిగా అమలులో ఉండాలని, నిబంధనల ఉల్లంఘనలకు తావు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

### ఎక్స్ ఆఫీషియో సభ్యుల ఓటు హక్కుపై స్పష్టత

ఎంపిక ప్రక్రియలో భాగంగా కౌన్సిలర్లు, ఎక్స్ ఆఫీషియో సభ్యులకు ముందుగానే సమాచారం అందించాలని, పోలింగ్, లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు సూచించారు. పరోక్ష విధానం ద్వారా జరిగే మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు ఎక్స్ ఆఫీషియో హోదాలో ఏదో ఒక మున్సిపాలిటీని ఎంపిక చేసుకుని ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. సెక్షన్ 5, 20 ప్రకారం ప్రజాప్రతినిధులు తాము ఎన్నికైన 30 రోజుల్లోపు ఏదో ఒక మున్సిపాలిటీకి ప్రాతినిధ్యం వహించేందుకు ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుందని, ఇప్పటివరకు ఆప్షన్ ఇవ్వని వారు మున్సిపల్ ఎన్నికలు జరిగిన 30 రోజుల్లోపు సంబంధిత మున్సిపల్ కమిషనర్‌కు ఆప్షన్ ఇవ్వాలని స్పష్టం చేశారు.

దీనికోసం ఫిబ్రవరి 11 నుంచి 14వ తేదీ లోపు నోటీసులు జారీ చేసి ప్రజాప్రతినిధుల నుంచి ఆప్షన్లు తీసుకోవాలని ఆదేశించారు.

### జగిత్యాల జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాంలి : జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ౹జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు సంబంధించి రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం పోలింగ్, కౌంటింగ్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సమయంలో ఎన్నికల నిబంధనల మేరకు అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులకు ఫిబ్రవరి 11 నుంచి 14వ తేదీ లోపు నోటీసులు జారీ చేసి ఆప్షన్లు తీసుకుంటామని, ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

# మోడీ పాలనలో ఊహకందని అభివృద్ధి





**నేటి సాక్షి, గజ్వేల్ :** మోడీ నాయకత్వంలో దేశం ఊహించని రీతిలో అభివృద్ధి చెందుతోందని, అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా భారత్‌ను ముందుకు తీసుకెళ్లింది బీజేపీ ప్రభుత్వమేనని ఎంపీ రఘునందన్ రావు అన్నారు.

- ప్రతిపక్షాల విమర్శలు సిగ్గుచేటు : ఎంపీ రఘునందన్ రావు

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా ఆయన పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రవేశపెట్టిన ఏడు హైస్పీడ్ రైళ్లలో మూడు దక్షిణ భారతదేశానికి మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి దక్షిణ భారత రాష్ట్రాలకు ఎక్కువ నిధులు కేటాయించడంతో పాటు, రైల్వే రంగానికి 15 శాతం, రహదారులకు 10 శాతం అదనపు నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. వాజపేయి హయాంలో ప్రారంభమైన జాతీయ రహదారులు, రైలు మార్గాల అభివృద్ధిని మోడీ ప్రభుత్వం మరింత వేగవంతం చేసిందన్నారు. దేశవ్యాప్తంగా అభివృద్ధి కళ్లకు కనిపిస్తున్నప్పటికీ, కుటుంబ రాజకీయాల కోసం ప్రతిపక్షాలు మోడీపై విమర్శలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలే ఇప్పటికే ప్రతిపక్ష నాయకులను తిరస్కరించారని వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌ను సరిగా అర్థం చేసుకోకుండా విమర్శలు చేస్తే రాజకీయంగా నష్టపోతారని టీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు కమలం పువ్వు గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, రాష్ట్ర నాయకులు నందన్ గౌడ్, నలగమ శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌తో పాటు బీజేపీ అభ్యర్థులు పాల్గొన్నారు.




# మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్):** మున్సిపల్ ఎన్నికలను పూర్తిగా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేలా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అధికారులను ఆదేశించారు. నారాయణపేట జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు నాణ్యత, నేరాల నియంత్రణ అంశాలపై సమీక్షించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని, రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జరిపి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం అందేలా చూడాలని తెలిపారు. కేసుల విచారణలో జాప్యం, నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో అక్రమ గంజాయి రవాణా, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దొంగతనాల కేసుల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, సున్నిత గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. అక్రమ నగదు, మద్యం, ఇతర ప్రలోభకర వస్తువుల రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టుల వద్ద కఠిన తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లను వెంటనే అమలు చేయాలని, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో గొడవలు జరగకుండా ముందస్తు బైండోవర్ కేసులు నమోదు చేసి, వెపన్స్ డిపాజిట్ ప్రక్రియను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలు, వృద్ధులు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల కోడ్‌ను కఠినంగా అమలు చేసి ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హూల్ హాక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐలు, ఎస్సైలు తదితర జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ అభ్యర్థికి 'డబుల్' ఓటు

### నామినేషన్ రద్దు చేయాలని ఎంఐఎం డిమాండ్!
### జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎంఐఎం అభ్యర్థి బాబు జానీ
### చర్యలు తీసుకోకుంటే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరిక

**నేటి సాక్షి, కరీంనగర్:** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల వేళ 37వ డివిజన్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మాజీ కార్పొరేటర్ మహమ్మద్ షర్ఫొద్దీన్ రెండు వేర్వేరు చిరునామాలతో ఓటు హక్కు కలిగి ఉన్నారని, ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని ఎంఐఎం అభ్యర్థి మొహమ్మద్ అహ్మద్ మొహియుద్దీన్ (బాబు జానీ) ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు.

### రెండు చోట్ల ఓటు హక్కు.. నిబంధనల ఉల్లంఘన

బాబు జానీ తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. అభ్యర్థి శర్ఫొద్దీన్ (EPIC No.YOJ6274371) పట్టణంలోని ఇంటి నెం. 8-5-30/1, ఇంటి నెం. 1-1-191 అనే రెండు వేర్వేరు చిరునామాల ద్వారా ఓటు హక్కు కలిగి ఉన్నారు. గత ఎన్నికల్లో కూడా ఈ రెండు చోట్ల ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆయన ఆరోపించారు. ఒకే వ్యక్తి రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉండటం, దానిని అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.

### నామినేషన్ తిరస్కరించకుంటే న్యాయపోరాటం

శర్ఫొద్దీన్ నామినేషన్‌ను వెంటనే తిరస్కరించాలని బాబు జానీ డిమాండ్ చేశారు. "ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఒకవేళ ఆయన నామినేషన్‌ను ఆమోదిస్తే, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మేము గౌరవ కోర్టును ఆశ్రయించడానికి సిద్ధంగా ఉన్నాము" అని ఆయన పత్రికా ముఖంగా హెచ్చరించారు. ఎన్నికల స్క్రీనింగ్ ప్రక్రియ ముగిసే సమయానికి అధికారులు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఉత్కంఠ ఇప్పుడు 37వ డివిజన్ ఓటర్లలో నెలకొంది.